

## నాణ్యమైన విద్యకోసం సమిష్టి కృషి అవసరం : మున్సిపల్ చైర్మన్ జాం రవి

ప్రజాపక్షం/శామీర్‌పేటఃవిద్యార్థులకు నాణ్యమైన, గుణాత్మకమైన విద్యను అందించడానికి అందరు సమిష్టిగా కృషి చేయాలని మూడుచింతలపల్లి మున్సిపల్ చైర్మన్ జాం రవి అన్నారు. ప్రజాపాలన ప్రగతి ప్రణాలికలో బాగంగా తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్న విద్యా వారొత్సవాలకు ముఖ్య అతిదిగా విచ్చేశారు. అనంతరం పదవ తరగతిలో మండల టాప ర్‌గా నిలిచిన హరికకు రూ. 10,110, రెండవ స్థానంలో నిలిచిన మనస్వి నికి రూ. 5,100 నగదు అంజేసి శాలువాతో సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్తులో విద్యా రంగానికి పెద్దపీట వేస్తామని చెప్పారు. విద్యార్థులకు కావాల్సిన మౌళిక వసతులను సమకూర్చుతామని అన్నారు. ఈ కార్యక్రమంలో ఎంఇఒ బాగ్యమణి, స్థానిక కౌన్సిలర్లు సరిత, శ్రీవాణి, కొంపల్లి మాధవి భూమేష్‌గౌడ్, అజయ్‌కుమార్, నవీన్, గోవర్ధన రెడ్డి, రమేష్, నాయకులు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.



## జర్నలిస్టులకు చలువ అద్దాలు అందజేత

ప్రజాపక్షం/చర్లపల్లిః జర్నలిస్టుల సంక్షేమానికి తోడ్పాటు అందిస్తామని వాసవి క్లబ్ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ గవర్నర్ సముద్రాల కృష్ణమూర్తి అన్నారు. హచ్‌బి కాలనీ ఉమా ఆప్టికల్స్ అధినేత నేర్లకంటి శ్రీనివాస్ సమకూర్చిన సన్ గ్లాస్(చలువ అద్దాలు)గురువారం ప్రెస్‌క్లబ్ కార్యాలయంలో మదర్ కమిటీ జర్నలిస్టులకు అందజేశారు. నిత్యం ప్రజా సమస్యలను వెలికి తీయ డంలో జర్నలిస్టులు చేస్తున్న కృషిని ఆయన అభినందించారు. ఈ కార్యక్ర మంలో ప్రెస్‌క్లబ్ మదర్ కమిటీ అధ్యక్ష, కార్యదర్శులు వడ్లోజు జ్యోతిర్మయ చారి, శ్రీనివాస్, ఉపాధ్యక్షులు పవన్, బాల్‌రెడ్డి,సెక్రెటరీ రోజారాణి, సీని యర్ జర్నలిస్టులు చంద్రమౌళి, వి శ్రీనివాస్, సహదేవచారి, శంకర్, క్లబ్ ప్రతినిధులు వెంకటేశ్వర్లు,లక్ష్మి సామ్రాజ్యం, తదితరులు పాల్గొన్నారు.

## ఇంకుడు గుంతల పునరుద్దరణ కార్యక్రమం



ప్రజాపక్షం/చర్లపల్లిః భూగర్భ జలాలను పెంపోందించేందుకు ఇంకుడు గుంతలు విరివిగా నిర్మించుకోవాలని కాప్రా డిప్యూటీ కమిషనర్ శ్రీహరి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక 99రోజుల కార్యక్రమం ఒలోభాగంగా రాబోయే వర్షాకాలం నీటిని వృధా చేయకుండా భూగర్భ జలాల అభివృద్దిలో భాగంగా విద్యా సంస్థలు,ఇనిస్టిట్యూషన్‌లో గతంలో ఏర్పాటు చేసిన ఇంకుడు గుంతల పునరుద్దరణ కార్యక్రమాన్ని సాకేత్ కాలనీలో పాస్టర్ బిల్లాబాంగ్ హై ఇంటర్నేషనల్ స్కూల్, కుషాయిగూడ ప్రభుత్వ పాఠశాలలో చేపట్టారు. ఈ కార్యక్రమంలో ఎస్‌డబ్ల్యూఎం డిఇ రవి,సూపర్‌వైజర్ సుదర్శన్, సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.




## ప్రభుత్వ పాఠశాలల్లోనే నాణ్యమైన విద్యాబోధన

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : ప్రభుత్వ పాఠశాలల్లో నాణ్యమైన విద్యాబోధన జరుగుతుందని దీనిని సద్వినియోగం చేసుకునే విధంగా పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లోనే చేర్పించాలని ప్రభుత్వ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు కొమిరెడ్డి పాపిరెడ్డి,ప్రధానోపాధ్యాయురాలు విజయలు అన్నారు. గురువారం ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమాన్ని ప్రారంభించారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో బడీడు పిల్లలను తప్పనిసరిగా చేర్పించాలని విద్యార్థుల భవిష్యత్తుకు ప్రభుత్వ పాఠశాలలే మెరుగైన పునాదిగా పేర్కొన్నారు.ప్రైవేట్ పాఠశాలల్లో కంటే నిష్ణాతులైన ఉపాధ్యాయులు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యాబోధన చేస్తున్నారని అన్నారు. అలాగే ప్రభుత్వం ఉచిత విద్యాబోధనతో పాటు పుస్తకాలు,యూనిఫాంలను, మధ్యాహ్న భోజనాన్ని అందిస్తూ విద్యార్థుల భవిష్యత్తుకు పాటుపడుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు విజ్ఞతతో ఆలోచించి తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాల్లో చేర్పించి ప్రభుత్వ విద్యారంగాన్ని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో హేమలత,ట్రైనీ గూప్ అధికారి విష్ణు నందన్, ఉపాధ్యాయులు సంతోష్ కుమార్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## రైతులకు అవగాహన సదస్సు

ప్రజాపక్ష /పూడూర్ : పరిగి నియోజకవర్గంలో ని పూడూర్ మండలంలోని రైతు వేదికల్లో వివిధ గ్రామాల నుంచి వచ్చిన రైతులకు శిక్షణ కార్యక్రమం ఇవ్వడం జరిగింది. రైతులకు నానో యురియ ,డిఎపి,జింక్ కాపర్ లాంటి ఎరువుల వాడకంపై రైతులకు శిక్షణ ఇవ్వడం జరిగింది. జాతీయ నూనె గింజల పరిశోదన సంస్థ రాజేంద్రనగర్ నుంచి వచ్చిన శాస్త్రవేత్తలు ఉషాకిరణ్ , రమ్య మాట్లాడుతూ ఎరవుల సమతుల్యతపై వివరిస్తూ భూసార పరీక్షల ప్రాముఖ్యత పై వివరిస్తూ భూసార పరీక్షల ఆధారంగా ఎరువుల ఎలా వాడాలి అనే విషయం గురించి రైతులకు తెలియజేశారు.

## విద్యుదాఘాతంతో వ్యక్తి మృతి



ప్రజాపక్షం/చర్లపల్లిః విద్యుత్ షాక్ గురై ఓ వ్యక్తి మృతి చెందిన సంఘటన కుషాయిగూడ పోలీస్ స్టేషన్‌లో చోటు చేసుకుంది. సిఐ భాస్కర్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం ఏఎస్ రావు నగర్ కాలనీకి చెందిన కృష్ణ బుధవారం రాత్రి బాల్కనీలో ఉన్న ఐరన్ ఎయిర్ కూలర్‌లో నీరు నింపుతుండగా కూలర్‌కు విద్యుత్ ప్రవాహం ఉండడంతో ప్రమాదవశాత్తు చేతి తగిలి విద్యుత్ షాక్ గురయ్యాడు. కుటుంబ సభ్యులు చూసి విద్యుత్‌ను నిలిపివేయగా ఆయన కిందపడిపోయాడు. దీంతో 108 అంబులెన్స్ ద్వారా పాలోమీ ఆసుపత్రికి తరలించగా పరిక్షించిన వైద్యులు అప్పటికే మృతి చెందారని తెలిపారు. ఫిర్యాదుదారుడు మనీత్ ఇచ్చిన ఫిర్యాదుతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఆయన తెలిపారు.

# దారితప్పిన ట్రాఫిక్ వ్యవస్థ

* అడుగడుగునా ట్రాఫిక్ జామ్‌లు
* చలాన్ల వసూళ్లకే ట్రాఫిక్ పోలీసులు
* ఎన్‌ఫోర్స్‌మెంట్ గురించి పట్టించుకోరు
* ఎక్కడ చూసినా ఫుట్‌పాత్ ఆక్రమణలే
* క్యూర్ పరిధిలో తగ్గిన వాహనాల వేగం
* కొత్త పార్కింగ్ పాలసీపై ఆశలు



ప్రజాపక్షం/సిటీబ్యూరో: క్యూర్ పరిధిలో 1.40కోట్ల జనాభా.. 15 వేల కిలోమీటర్ల మేరకు ఉన్న విస్తరించిన రోడ్లపై లక్షల సంఖ్యలో వాహనాలు రాకపోకలు సాగిస్తుంటాయి. సుమారుగా 90 లక్షల వాహనాలు నమోదై ఉండగా.. అందులో 60 శాతం ద్విచక్రవాహనాలు.. మిగతావి త్రీ, ఫోర్‌తో పాటు ఆరు చక్రాల వాహనాలు ఉన్నట్లు సమాచారం. రోజుకు 1,500 కొత్త వాహనాలు రోడ్డెక్కుతున్నాయి. ఇంత పెద్ద ఎత్తున వాహనాలు రహదారుల్లోకి వస్తుండటంతో సహజంగానే ట్రాఫిక్ సమస్యలు ఉత్పన్నం అవుతున్నాయి.

అయితే ట్రాఫిక్ జామ్‌లు కాకుండా ఉండేందుకు ఏర్పాటైన ట్రాఫిక్ పోలీస్ వ్యవస్థ కేవలం చలాన్ల వసూళ్లకే పరిమితమై.. తమకు కేటాయించిన కోటాను ఎలా పూర్తి చేసుకోవాలా? అనే విషయాలపైనే సిబ్బంది దృష్టి సారిస్తున్నారు. ఇక ఇండియన్ రోడ్ కాంగ్రెస్ నిబంధనల ప్రకారం రోడ్డు విస్తీర్ణంలో 30 శాతం ఫుట్‌పాత్ ఉండాలి. ఈ లెక్కల ప్రకారం క్యూర్ పరిధిలో ఫుట్‌పాత్‌లు దాదాపు 5 వేల కిలోమీటర్ల మేరకు నిర్మించాల్సి ఉన్నది. కానీ కేవలం 700 కిలోమీటర్ల మేరకు మాత్రమే ఫుట్‌పాత్‌లు ఉండటంతో ట్రాఫిక్ సమస్య నెలకొంటున్నది. ముఖ్యంగా ఉన్న కొద్దిపాటి ఫుట్‌పాత్‌లు కూడా ఆక్రమణలకు గురై వ్యాపారాలు నిర్వహిస్తుండటంతో వాహనదారులతో పాటు గా పాదచారులు కూడా రహదారుల్లోకి వచ్చేస్తున్నారు. దీంతో క్యూర్ పరిధిలో వాహనాల వేగం 18 కెఎంపీహెచ్‌కు పడిపోయింది. ఈ క్రమంలోనే తెలంగాణ ప్రభుత్వం నూతన ట్రాఫిక్ పార్కింగ్ పాలసీ రూపొందిస్తున్న తరుణంలో ట్రాఫిక్ జామ్‌లు.. పార్కింగ్ సమస్య.. ఫుట్‌పాత్ ఆక్రమణల సమస్యలకు పరిష్కారం లభిస్తుందని ఆశిస్తున్నారు. క్యూర్ పరిధితో పాటు ఫ్యూచర్ సిటీ రూపొందుతున్న తరుణంలో ట్రాఫిక్ సమస్య ప్రధానం గా చర్చకు వస్తున్నది. ముఖ్యంగా క్యూర్ పరిధిలోని ప్రధాన ప్రాంతా ల్లో రోడ్లపై నిమిషానికి పదుల సంఖ్యలోనే వాహనాలు పరుగులు పెడుతుంటాయి.

రోడ్లను ఎంత విస్తరిస్తున్నా..రోడ్లు, ఫుట్‌పాత్‌ల ఆక్రమణల కారణంగా ఆశించిన ఫలితాలు రావడం లేదు. ఇటీవల క్యూర్ పరిధిలో 2,337 ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించినట్లు మూడు మున్సిపల్ కార్పొరేషన్ల కమిషన ర్లు ప్రకటించినా.. తిరిగి యథావిధిగా ఫుట్‌పాత్ ఆక్రమణలు చోటుచేసుకుంటున్నాయి. కొన్ని ప్రాంతాల్లో ఫుట్‌పాత్ మాఫియాది పైచేయిగా మారుతోంది. రాజకీయ కారణాల నేపథ్యంలో బజర్దస్త్‌గా ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఫుట్‌పాత్ ఆక్రమణలకు వత్తాసు పలుకుతుండటంతో సంబంధిత అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. ఇక బల్దియా, పోలీస్ విభాగాల్లో ఐపీఎస్ అధికారులు ఉన్నావారు చేష్టలుడిగి చూస్తుండిపోతున్నారు.

**ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎక్కడ?**

రోడ్లు ఎంతమేరకు విస్తరించినా.. ట్రాఫిక్ కష్టాలు మాత్రం తప్పటం లేదు. ఎక్కడికి వెళ్లినా వాహనాల పార్కింగ్ పెద్ద సమస్యగా మారింది. ఎక్కడ పడితే అక్కడ రోడ్లమీద అక్రమ పార్కింగ్ చేసే వారి సంఖ్య గణనీయంగా పెరిగిపోయిం ది. ఆ పక్కనే ఫుట్‌పాత్‌లపై నెలకొంటున్న వ్యాపారాలు. ఒక్క మాటలో చెప్పాలంటే ట్రాఫిక్ పోలీస్ వ్యవస్థ కుప్పకూలిందని చెప్పవచ్చు. ఎన్‌ఫోర్స్‌మెంట్ గురించి ఆలోచించడం మానేశారు. ఎందుకంటే హెల్మెల్ వినియోగం తగ్గింది. సెల్‌ఫోన్ డ్రైవింగ్ పెరిగింది. రాంగ్ రూట్ సమస్య తీవ్ర రూపం దాల్చింది. ట్రిపుల్ రైడింగ్, నెంబర్ ప్లేట్ల బాగోతాలు, ఫుట్‌పాత్ ఆక్రమణలు...ఇలా ఎంత చెప్పినా తక్కువే అవుతుంది. ఈ క్రమంలోనే ట్రై పోలీస్ కమిషనరేట్ల పరిధిలో ప్రత్యేకంగా ట్రాఫిక్ పోలీస్ విభాగం ఉన్నా.. నిబంధనల ఉల్లంఘనులను ఏమీ చేయలేకపోతున్నారు.

ఇటువంటి పరిస్థితుల్లో హైదరాబాద్, సైబరాబాద్, మల్కాజిగిరి పోలీస్, మున్సిపల్ కమిషనరేట్ల పరిధిలోని ప్రధాన ప్రాంతాలు, రద్దీ ప్రాంతాల్లో రోడ్లు, ఫుట్‌పాత్‌లు ఆక్రమణదారుల చేతుల్లోకి వెళ్లిపోవడంతో ట్రాఫిక్ సమస్య తీవ్రరూపం దాల్చిందని చెప్పవచ్చు. పార్కింగ్ పాలసీ, ఫుట్‌పాత్ పాలసీని పక్కాగా రూపొందించి అమలు చేస్తేనే క్యూర్ పరిధిలోని రోడ్లపై వాహనాల వేగం పెరిగే అవకాశం ఉంటుంది.

## సైబర్ నేరాలపై అవగాహన పెంచుకోవాలి

మేడిపల్లి ఎస్ఐ పి.శ్రీనివాస్





ప్రజాపక్షం/బోడుప్పల్ : సైబర్ నేరాలపై ప్రతి ఒక్కరూ అవగాహన పెంచుకోవాలని ఎస్ఐ పి. శ్రీనివాస్ అన్నారు. గురువారం మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ సర్కిల్ ఆకృతి టౌన్‌షిప్‌లో సైబర్ నేరాలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, సైబర్ నేరాలు బాగా పెరిగాయని, ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నా రు. వాట్సప్‌లో వచ్చే లింక్‌లు ఓపెన్ చేయొద్దని అన్నారు. సైబర్ నేరాల్లో విద్యావంతులే అధికం గా మోసపోతుండడం బాధాకరమన్నారు. మల్టీలెవల్ మార్కెటింగ్, ఇన్వెస్ట్‌మెంట్ ఫ్రాడ్, ఇతర ఆన్‌లైన్ మోసాలు ఎక్కువగా జరుగుతున్నాయన్నారు. ఏ పోలీస్ అధికారి నేరుగా వాట్సప్ వీడియోకాల్స్ చేయరని, డిజిటల్ అరెస్టులు అని ఎవరైనా కాల్స్ వస్తే సంబంధిత పోలీస్ స్టేషన్లో వెంటనే సమాచారం ఇవ్వాలన్నారు. ప్రజల బలహీనతలే సైబర్ నేరగాళ్లకు బలంగా మారిందన్నారు. మారుతున్న టెక్నాలజీతో మోసగాళ్లు చెలరేగిపోతున్నారన్నారు.అప్రమత్తంగా ఉంటేనే నష్టం జరగదన్నారు. సైబర్ నేరగాళ్ల చేతిలో నష్టపోతే తక్షణమే 1930లో ఫిర్యాదు చేయాలన్నారు. మైనర్లకు వాహనాలు నడపడానికి ఇవ్వొద్దని, ఎవరైనా తల్లిదండ్రులు ఇస్తే వాహనాలు సీజ్ చేసి తల్లిదండ్రులపై కేసులు నమోదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ తిరుపతి, ఎఎస్ఐ శ్రీశైలం, లక్ష్మి నగర్ కాలనీ అమర్ లింగారెడ్డి, టౌన్ షిప్ అధ్యక్షుడు రావుల రమేష్, ప్రధాన కార్యదర్శి వేణు, కోశాధికారి శశివర్ధన్, దక్షిణమూర్తి, బడ్డి, తదితరులు పాల్గొన్నారు.

## పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం : ఎమ్మెల్యే కాలే యాదయ్య



ప్రజాపక్షం/నవాబుపేట్ :పేద ప్రజల సంక్షేమమే కాంగ్రెస్ ప్రభుత్వ ప్రధాన లక్ష్యం అని, ప్రతి నిరుపేద కుటుంబానికి సొంత ఇల్లు కల్పించేందుకు ప్రభుత్వం కట్టుబడి పనిచేస్తోందని స్థానిక ఎమ్మెల్యే కాలే యాదయ్య అన్నారు. గురువారం అక్నాపూర్ గ్రామానికి చెందిన యం డి.జహంగీర్‌కు సంబంధించిన ఇందిరమ్మ నూతన గృహప్రవేశ కార్యక్రమా న్ని ఎమ్మెల్యే కాలే యాదయ్య కుటుంబ సభ్యులతో కలిసి ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఇంటిని పరిశీలించిన ఎమ్మెల్యే, ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాల వల్ల పేద కుటుంబాల జీవితాల్లో మార్పు వస్తోందన్నారు.

ఈ సందర్భం గా ఎమ్మెల్యే మాట్లాడుతూ, గతంలో ఎన్నో సంవత్సరాలు సొంత ఇంటి కలతో జీవించిన పేద కుటుంబాలకు ఇప్పుడు ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా ఆశాకిరణం కనిపిస్తోందన్నా రు. గ్రామీణ ప్రాంతాల్లో ఇళ్లులేని నిరుపేదలను గుర్తించి అర్హులందరికీ దశలవారీగా ఇళ్లు మంజూరు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి పేదవాడు గౌరవంగా జీవించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం అనేక సంక్షేమ కార్యక్రమాలను అమలు చేస్తోందని చెప్పారు. ప్రభుత్వం ప్రజల సంక్షేమాన్ని దృష్టిలో పెట్టుకొని విద్య, వైద్యం, తాగునీరు, రహదారులు, గృహ నిర్మాణం వంటి రంగాలకు ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ఇందిరమ్మ గృహం పొందిన కుటుంబ సభ్యులు ఎమ్మెల్యే కాలే యాదయ్యకు కృతజ్ఞతలు తెలిపారు. తమకు సొంత ఇల్లు కల్పించడం జీవితంలో మరచిపోలేని ఆనందమని చెప్పారు. గ్రామ ప్రజలు కూడా ఎమ్మెల్యేకు ఘన స్వాగతం పలికి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, కాంగ్రెస్ పార్టీ నాయకులు, బలరాం, చంద్రయ్య గౌడ్, సర్వర్ ఖాన్, సంజీవ రెడ్డి, సత్యయ్య గౌడ్,గ్రామ పెద్దలు, పాల్గొన్నారు.

## చైన్ స్నాచర్ అరెస్టు

ప్రజాపక్షం/మల్కాజిగిరి: మూడు రోజల క్రితం జరిగిన చైన్‌స్నాచింగ్ ఉదంతంలో నిందితుడిని నేరేడ్‌మెట్ పోలీసులు అరెస్టు చేసారు. ఇన్‌స్పెక్టర్ సందీప్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం నిందితుడు కడప జిల్లాకు చెందిన శేఖర్ (31) ఆర్మీలో జనరల్ డ్యూటీ జవాన్‌గా పని చేస్తూ ఆల్వాల్‌లోని త్రిశూల్ లైన్ ఆర్మీ క్వార్టర్‌లో నివాసం ఉంటున్నాడు. గత కొద్ది కాలంగా అతడు బెట్టింగ్‌లకు పాల్పడుతూ అప్పుల్లో కూరుకుపోయి చైన్‌స్నాచర్ అవతారమెత్తాడు. దీని కోసం మందస్తు పథకం ప్రకారం గత 10న తయారు చేయించుకొన్న AP 04 BX 7477నంబరుతో ఉన్న రేడియం స్టిక్కరును తన పల్సర్ బైకు నంబర్ AP 04 BX 7477 స్థానంలో తగిలించాడు. దాల్ఫిన్ వైన్‌షాప్ దగ్గర సప్తగిరి కాలనీకి చెంది జోన్నగడ్డ యోగేందర్ మణి మేఘల(57)నడుచుకొంటూ వెళుతుండగా అడ్రస్ కావాలంటూ అడిగి అదను చూసి ఆమె మెడలోంచి 3 తులాల నల్లపూసల బంగారు గొలుసును లాక్కొని పరారయ్యాడు.

## ఓటర్లందరూ ఎస్ఐఆర్ చేయించుకోవాలి

ప్రజాపక్షం/పరిగిః మున్సిపల్‌లోని ఓటర్లందరూ తప్పనిసరిగా తమ ఓటునుఎస్ఐఆర్ చేయించుకోవలని మున్సిపల్ చైర్‌పర్సన్ రజిత వెంకటేష తెలిపారు. తమ వార్డు 16లోని ఎస్ఐఆర్ కొరకు ప్రత్యేక క్యాంపు ఏర్పాటు చేశారు. ఈ ప్రక్రియపట్టిష్టంగా జరిగేట్లు చూడాలని బిఎల్ఓలకు సూచించారు. వార్డులో గల ఓటర్లు అందరూ తప్పనిసరిగా ఎస్ఐఆర్ చేయించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది, బిఎల్ఓలు, తదితరులు పాల్గోన్నారు.

## మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యం

కొలను హన్మంత రెడ్డి

ప్రజాపక్షం/ నిజాంపేట్ : మహిళల అభివృద్ధితోనే దేశాభివృద్ధి సాధ్యమని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి అన్నారు. కుత్బుల్లాపూర్ జోనల్ పరిధిలోని సూరారం, సాయిబాబా నగర్‌లో మహిళా వారోత్సవాల సందర్భంగా మహిళల హక్కులు, సంక్షేమం, సాధికారతపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి విచ్చేసి మాట్లాడుతూ మహిళలు సమాజానికి వెన్నెముకలాంటి వారని, మహిళల అభివృద్ధి లేకుండా దేశాభివృద్ధి సాధ్యం కాదని అన్నారు. మహిళలు ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా మరియు విద్యాపరమైన స్వావలంబన కల్పించాల్సిన బాధ్యత ప్రభుత్వాలతో పాటు రాజకీయ పార్టీలు సైతం తీసుకోవాలని పేర్కొన్నారు. మహిళల సంక్షేమం, హక్కుల పరిరక్షణ విషయం లో కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ కట్టుబడి ఉందని, మహిళల సమస్యలను పరిష్కరించడంలో నిరంతరం పోరాటాలు చేస్తూనే ఉంటామని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం మహిళా సంఘాల అభివృద్ధి కొసం అమలు చేస్తున్న వివిధ సంక్షేమ పథకాలను మహిళలు సద్వినియోగం చేసుకుని ఆర్థికంగా మరింతగా రాణించాలని సూచించారు. మహిళలకు చీరల పంపిణీ నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ఫిషరీస్ చైర్మన్ మన్నెరాజు, కాంగ్రెస్ నేతలు శ్రావణ్ కుమార్, సిద్ధనోళ్ల సంజీవ రెడ్డి, మహిళలు పాల్గొన్నారు.

**ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలాధారం**

ఓటు హక్కు ప్రజాస్వామ్యానికి మూలాధారమని, ప్రతి పౌరుడు తన ఓటు వివరాల ను తప్పనిసరిగా తనిఖీ చేసుకోవాలని కుత్బుల్లాపూర్ నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి కొలను హన్మంత రెడ్డి సూచించారు. కుత్బుల్లాపూర్ నియోజకవర్గం పరిధిలోని బాచుపల్లిలోని కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఎస్ఐఆర్ (స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్) కార్యక్రమం పై పార్టీ నాయకులు, కార్యకర్తలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశంలో కొలను హన్మంత రెడ్డి పాల్గొని ఓటర్ల నమోదు, నూతన ఓటర్ల చేర్పు, ఓటరు జాబితాలోని తప్పుల సవరణ, పేరు, చిరునామా మార్పులు, అనవసరంగా ఓటర్ల తొలగింపులు జరగకుండా తీసుకోవాల్సిన చర్యల పై అవగాహనను కల్పించారు.



ఈ సందర్భంగా హన్మంత రెడ్డి మాట్లాడుతూ ఓటర్లలో నెలకొన్న సమస్యలు, దృష్టికి వచ్చిన సమస్యలను ఎన్నికల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి త్వరితగతిన పరిష్కరించేలా కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని సూచించారు.

కాంగ్రెస్ పార్టీ ఎల్లప్పుడూ ప్రజల పక్షాన నిలబడుతుందని అన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




## మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యం

అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి

ప్రజాపక్షం/శామీర్‌పేటః ప్రజలకు మెరుగైన వసతులు కల్పించడమే లక్ష్యంగా పరిపాలన కొనసాగిస్తామని అలియాబాద్ మున్సిపల్ చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అన్నారు. అలియాబాద్ మున్సిపల్‌లో చైర్ పర్సన్ కమఠం శిరీషా కృష్ణారెడ్డి అద్యక్షతన మున్సిపల్ సాధారణ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 202627 ఆర్థిక సంవత్సరానికి సంబందించి మున్సిపల్‌లోని అన్ని వార్డుల్లో తాగునీరు సరఫరా, డ్రైనేజి వ్యవస్థ పరిరక్షణ, స్ట్రీట్ లైట్స్ నిర్వాహణ, ఎలక్ట్రికల్ మెయింటనెన్స్, పారిశుద్య నిర్వహాణ, కార్యాలయ పరిపాలన, మున్సిపల్ మౌళిక సదుపాయల అభివృద్ధి తదితర అంశాలపై సభ్యులు సుదీర్ఘంగా చర్చించారని చెప్పారు. మౌళిక సదుపాయాల కొరకు రూ. 3.70 కోట్లు విలువైన పనులకు పరిపాలన ఆమోదం తీసుకోవడం జరిగిందన్నారు. నూతనంగా ఏర్పాటైన మున్సిపల్‌ను అన్ని రంగాల్లో అభివృద్ధి పరుచుటకు కృషి చేస్తానని అన్నారు. పారదర్శక పాలనతో ప్రజలకు నాణ్యమైన సేవలందించేందుకు కట్టుబడి ఉన్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో వైస్ చైర్ పర్సన్ కన్‌రెడ్డి మాలతి మాధవరెడ్డి, మున్సిపల్ కమిషనర్ వెంకట్‌రెడ్డి, కౌన్సిలర్లు, తహాశీల్దార్ సుచరిత, ఎంఇఒ కమలాకర్, ఎఇ వెంకటనారాయణ, మున్సిపల్ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



## మూడు క్లినిక్‌ల సీజ్

ప్రజాపక్షం/మేడ్చల్ మల్కాజిగిరి : నిబంధనలకు విరుద్ధంగా మేడ్చల్ జిల్లాలో నిర్వహిస్తున్న అనధికారిక మూడు క్లినిక్‌లను డిఎంహెచ్ఓ డా.ఉమాగౌరి గురువారం సీజ్ చేసారు. కెపిహెచ్‌బి, జగద్గిర్‌గుట్ట ప్రాంతాల్లో పలు క్లినిక్‌లు, ఆస్పత్రులను పరిశీలించారు. సుమన్ క్లినిక్, శ్రీ గాయత్రి క్లినిక్, సుమన హెల్త్ అండ్ రిహాబ్ సెంటర్‌లు ఎలాంటి వైద్యారోగ్య శాఖ జారీ చేసిన రిజిష్ట్రేన్లు లేకుండా నిర్వహిస్తున్నట్లు వెల్లడవటంతో వాటిని సీజ్ చేసారు. జిల్లా వైద్యారోగ్య శాఖకు చెందిన వైద్య బృందం గీత, పవన్, డిప్యూటి డెమోలు తనిఖీల్లో పాల్గొన్నారు.

## అనురాగ్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్ పరీక్ష : డాక్టర్ మహీపతి శ్రీనివాస్ రావు

ప్రజాపక్షం/ఘట్‌కేసర్ : మధ్యతరగతి విద్యార్థులు టాలెంట్ ఉండి డబ్బులు లేని కారణంగా చదువులకు దూరం కాకుండా ప్రోత్సహించడానికి అనురాగ్ యూనివర్సిటీ స్కాలర్‌షిప్ పరీక్ష నిర్వహిందని యూనివర్సిటీ అడ్మిషన్స్ డైరెక్టర్ డాక్టర్ మహీపతి శ్రీనివాస్ రావు తెలిపారు. ఘట్‌కేసర్ సర్కిల్ పోచారం డివిజన్ పరిధి వెంకటాపూర్‌లోని అనురాగ్ యూనివర్సిటీ ఆవరణలో ఈ నెల 17,20 తేదీలలో మెరిట్ స్కాలర్‌షిప్ పరీక్షలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. ఈ సందర్భంగా శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ విద్యార్థులు పరీక్షలో సాధించిన ర్యాంక్‌ల ఆధారంగా గరిష్ఠంగా 100శాతం వరకు స్కాలర్‌షిప్‌తో పాటు ఉచిత ల్యాప్‌టాప్‌లను కూడా పొందే అవకాశం ఉంటుందని 115వరకు ర్యాంకులు సాధించిన విద్యార్థులకు 100శాతం స్కాలర్‌షిప్ 16 నుండి 30వరకు 50 శాతం 31నుండి 100శాతం వరకు 25శాతం స్కాలర్‌షిప్ అందివ్వడం జరుగుతుందని తెలిపారు. పరీక్షకు ఎలాంటి రిజిస్ట్రేషన్ లేదని విద్యార్థులు ఉదయం 9:30 నిమిషాల వరకు యూనివర్సిటీ చేరుకోవాలని వచ్చేటప్పుడు ఆధార్ కార్డు, రెండు ఫోటోలు తీసుకొని రావాలని సూచించారు.



## ధాన్యం దిగుమతి ప్రక్రియ వేగవంతం

కలెక్టర్ దీపక్‌తివారి అధికారులకు ఆదేశం

ప్రజాపక్షం/వికారాబాద్ః జిల్లాలో ఏర్పాటు చేసిన వరి కొనుగోలు కేంద్రాలలో ధాన్యం దిగుమతి ప్రక్రియను వేగవంతం చేయాలని జిల్లా కలెక్టర్ దీపక్‌తివారి అధికారులను అదేశించారు. వరి కొనుగోలుపై సమిక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర మాట్లాడుతూ రైతు సంక్షేమంలో భాగంగా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలలో కొనుగోలు చేసిన ధాన్యంను కేటాయించిన ప్రకారం రైస్ మిల్లులు గోదాములకు తరలించడం జరగాలన్నారు. కొనుగోలు కేంద్రాలలో రైతుల వద్ద నుండి ప్రభుత్వం నిబంధనల ప్రకారం నాణ్యమైన ధాన్యాన్ని కొనుగోలు చేసి కేటాయించిన ప్రకారం తరలించాలన్నారు. ఈ కార్యక్రమంలో డిసిఎం మోహన్‌కృష్ణ, సుదర్శన్, రాజరత్నం, తదితరులు పాల్గోన్నారు.

## మద్యానికి బానిసై వ్యక్తి ఆత్మహత్య

ప్రజాపక్షం/నవాబుపేట్ : మద్యానికి బానిసై మనస్థాపానికి గురైన ఓ వ్యక్తి పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్న ఘటన నవాబుపేట్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. ఎస్సై గిరి తెలిపిన వివరాల ప్రకారం మండల పరిధిలోని పులుమామిడి గ్రామానికి చెందిన బొవ్వి మల్లయ్య (52) ఒంటరిగా జీవిస్తూ తీవ్ర మనోవేదనకు గురయ్యాడు. ఈ క్రమంలో మద్యానికి అలవాటు పడి జీవితంపై నిరాశ చెందాడని తెలిపారు. ఈ నెల 13వ తేదీ ఉదయం క్షణికావేశంలో పురుగుల మందు తాగగా గమనించిన గ్రామస్తులు చికిత్స నిమిత్తం సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మల్లయ్య మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి కుమార్తె మమత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై గిరి వెల్లడించారు.

## మల్కాజ్‌గిరి సిపిని సత్కరించిన జాగృతి అభ్యుదయ సంఘం



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** మల్కాజ్‌గిరి పోలీస్ కమిషనర్‌గా బాధ్యతలు చేపట్టిన బి.సుమతి మహిళల్లో ఆత్మస్థైర్యాన్ని పెంచుతుందని, ఆడపిల్లల తల్లిదండ్రులకు భరోసానిస్తుందని భావిస్తూ ప్రజల తరపున గురువారం అభ్యుదయ సంఘం సభ్యులు మల్కాజ్‌గిరి కార్యాలయంలో సిపి సుమతిని కలిసి కృతజ్ఞతలు తెలుపుతూ ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ ఈ స్పెషల్ డ్రైవ్ ఒక్కరోజుతో ఆగిపోయేది కాదని, తన పరిధిలోని అనుమానిత ప్రాంతాల్లో తరచూ ఇలాంటి డ్రైవ్‌లు కొనసాగిస్తామన్నారు. నిషేధిత డ్రగ్స్‌పై ఉక్కుపాదం మోపుతామని, డ్రగ్స్ విస్తరించకుండా అడ్డుకట్ట వేసేందుకు స్వచ్ఛంద సంస్థలు, ప్రజలు ముందుకు రావాలని, డ్రగ్స్ అమ్మకందారుల సమాచారం అందించిన వారి పేర్లు గోప్యంగా ఉంచుతామని ఆమె పేర్కొన్నారు. సిపిని కలిసిన వారి అభ్యుదయ జాగృతి సంఘం అధ్యక్షులు భావన శ్రీనివాస్, శ్రీరంగనాథ్, కెవి రమణయ్య, వేమారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ బండ్లగూడ డిపో కమిటీ ఎన్నిక



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఏఐటియుసి అనుబంధ సంఘం నాగోల్ ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ బండ్లగూడ డిపో జనరల్ బాడీ సమావేశం గురువారం నిర్వహించారు. ఆర్టీసీ ఎంప్లాయిస్ యూనియన్ రీజనల్ సెక్రెటరీ బి. పాపయ్య గౌడ్ పర్యవేక్షణలో నూతన కమిటీని ఎన్నుకోవడం జరిగింది. అధ్యక్షులుగా ఈ ఎన్ రావు(కండక్టర్), కార్యదర్శిగా పీకే రెడ్డి (డ్రైవర్), జాయింట్ సెక్రెటరీగా ఆర్, బుచ్చయ్య (కండక్టర్), కోశాధికారిగా పి ఎస్ రెడ్డి (కండక్టర్), ఆర్గనైజింగ్ సెక్రెటరీగా ఎం, రాణి (కండక్టర్) వారి తో పాటు ముఖ్య సలహాదారులుగా జి. వెంకటేష్ (డ్రైవర్), సిహెచ్, శ్రీనివాస్( డ్రైవర్) మరి కొంత మందిని కార్యవర్గ సభ్యులుగా ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్బంగా వారు మాట్లాడుతూ ఆర్టీసీ కార్మికులు ఎదుర్కొంటున్న సమస్యలుపై పోరాటాలు నిర్వహిస్తామని తెలిపారు. ముఖ్యంగా వేతన సవరణ, ఇంక్రిమెంట్స్, ప్రభుత్వంలో విలీనం తదితర సమస్యలపై ముఖ్యమంత్రి గారి సమక్షంలో జరిగిన చర్యలు రీజనల్ కార్యదర్శి పాపయ్య గౌడ్ వివరించారు.

## ఎల్లమ్మ గుడి నిర్మాణానికి పూజలు



**ప్రజాపక్షం/కేశంపేట:** ఎల్లమ్మ దేవాలయ నిర్మాణానికి భక్తిశ్రద్ధలతో భూమిపూజ నిర్వహించారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని లేమామిడి గ్రామంలోని నాల్గవ వార్డు ప్రజల అభ్యర్థన మేరకు ఎన్ఆర్ఐ గోగు వెంకట్ నారాయణరెడ్డి సొంత పొలం నుండి కొంత స్థలాన్ని ఎల్లమ్మ తల్లి దేవాలయ నిర్మాణానికి దాతృత్వంతో అంధించారు. దాంతో దాత గోగు వెంకట్ నారాయణరెడ్డిని వార్డులోని ప్రజలు అభినంధించారు. ఈ సందర్భంగా సర్పంచ్ సులోచన శ్రీను మాట్లాడుతూ గ్రామంలో ఆధ్యాత్మిక వాతావరణం నెలకొల్పేందుకు దేవాలయ నిర్మాణం ఉపయోగపడుతుందని వివరించారు. దేవాలయ నిర్మాణానికి సహకరించిన వెంకట్ నారాయణరెడ్డిని గ్రామస్తులు ప్రత్యేకంగా అభినంధించారు. కార్యక్రమంలో శ్రీశైలం గౌడ్, ఉప సర్పంచ్ ప్రమోద్‌రెడ్డి, వార్డు సభ్యులు కుమార్ గౌడ్, శ్రీకాంత్ రెడ్డి, గ్రామస్తులు జగత్‌రెడ్డి, అమర్నాథ్‌రెడ్డి, శేఖర్‌రెడ్డి, జయపాల్‌రెడ్డి, సురేష్‌రెడ్డి, చాకలి రవి, వార్డు సభ్యులు పాల్గొన్నా

## అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలి

**ప్రజాపక్షం/మియాపూర్:** అభివృద్ధి పనుల్లో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, డ్రైనేజీ లైన్ల నిర్మాణ పనులను త్వరితగతిన పూర్తి చేయాలని మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ అన్నారు. గురువారం మియాపూర్ డివిజన్ పరిధిలోని న్యూ కాలనీలో నూతనంగా చేపట్టబోయే డ్రైనేజీ లైన్ల నిర్మాణ పనుల ప్రాంతాలను, శ్రీరంగాపురం కాలనీలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలను జిహెచ్ఎంసి మియాపూర్ డివిజన్ తాజా మాజీ కార్పొరేటర్ ఉప్పలపాటి శ్రీకాంత్ సంబంధిత అధికారులతో కలిసి పరిశీలించారు. జలమండలి డిజిఎం నారాయణ, సిఎంసి ఇంజినీరింగ్ విభాగం అధికారులు, స్థానిక ప్రజలతో కలిసి సమస్యలను పరిశీలించి పరిష్కార మార్గాలపై చర్చించారు. కార్యక్రమంలో సిఎంసి ఇంజినీరింగ్ విభాగం ఎఇ ప్రశాంత్, వర్క్ ఇన్స్పెక్టర్లు జగదీష్, లింగయ్య, స్థానిక నాయకులు, తదితరులు పాల్గొన్నారు.ఉ

## నీట్ పేపర్ లికేజీకి కేంద్ర విద్యాశాఖ మంత్రి బాధ్యత వహించాలి

**ప్రజాపక్షం/తుర్కయంజాల్ :** దేశ వ్యాప్తంగా వైద్య విద్యని అభ్యశించటానికి నిర్వహించిన నీట్ పరీక్ష పేపర్ లికేజి కావటానికి కేంద్ర విద్య మంత్రి బాధ్యత వహించాలని సిపిఐ అబ్దుల్లాపూర్ మెట్ మండల కార్యదర్శి అజ్మీరా హరిసింగ్ నాయక్ అన్నారు. మెట్టు మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో అయన మాట్లాడుతూ నీట్ పరీక్షని దేశ వ్యాప్తంగా సుమారు 23 లక్షల మంది విద్యార్థులు రాశారని వాళ్లంతా నేడు భయందోళనలో ఉన్నారన్నారు. ఈ చర్య వల్ల డాక్టర్ కావాలనే ఆశతో ఉన్న లక్షలాది మంది విద్యార్థుల ఆశల మీద నీళ్లు చెల్లినట్లు అయిందని ఆవేదన వ్యక్తం చేశారు. నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ తన పారదర్శికతను నిరూపించుకోలేక పోయిందని విమర్శించారు. ఈ పేపర్ లికేజికి పాల్పడిన కార్పొరేట్ విద్య మాఫియాపైన క్రిమినల్ కేసులు నమోదు చేయాలనీ. ఈ కేసును సుప్రీం కోర్టు జడ్జితో విచారణ జరిపి లికేజితో ప్రమేయం ఉన్న ప్రతి ఒక్కరి పైన చట్టపరమైన చర్యలు తీసుకోవాలన్నారు. కేంద్ర విద్య శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ పూర్తి బాధ్యత వహిస్తూ తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. ఈపేపర్ లికేజీతో కేంద్ర ప్రభుత్వానికి విద్యారంగం పట్ల ఉన్న నిర్లక్ష్యం స్పష్టంగా కనపడుతుంవన్నారు. ఇలాంటి సంఘటనలు జరగకుండా విద్య రంగం పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపాలని డిమాండ్ చేశారు.

# చేప ప్రసాదం పంపిణీకి అన్ని ఏర్పాట్లు

మౌలిక వసతులు, సిసి కెమెరాలు
బస్‌స్టేషన్లు, మెట్రోస్టేషన్‌ల నుంచి
ప్రత్యేక సర్వీసులు
మంత్రి పొన్నం ప్రభాకర్ ఆదేశాలు





**ప్రజాపక్షం/సిటీ బ్యూరో :** మృగశిర కార్తె సందర్భంగా హైదరాబాద్ నాంపల్లి మైదానంలో జరిగే చేప ప్రసాదం పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేయాలని హైదరాబాద్ జిల్లా ఇంచార్జి మంత్రి పొన్నం ప్రభాకర్ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. హైదరాబాద్ కలెక్టరేట్ సమావేశ మందిరంలో జూన్ 8న జరగనున్న చేపప్రసాదం పంపిణీ కార్యక్రమంపై అధికారులతో గురువారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. చేప ప్రసాదం పంపిణీలో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. పోలీస్, ట్రాఫిక్, రెవెన్యూ, జిహెచ్ఎంసి, ఆర్అండ్‌బి శాఖల అధికారులు కలిసి పని చేయాలన్నారు. శానిటేషన్, బారికేడ్ల ఏర్పాటు చేయడం, విద్యుత్ సరఫరాలో ఇబ్బందులు రాకుండా చూడడం, తాగునీటి సరఫరా వంటి వాటిని చూసుకోవాలన్నారు. ప్రతి సంవత్సరం మాదిరిగానే ఈ ఏడు కూడా అగర్వాల్ సమాజ్, జైస్వాల్ సమాజ్, బత్తిని ట్రస్టులు ఆహారాన్ని అందించే కార్యక్రమాలను కొనసాగించాలన్నారు. శాంతిభద్రతల సమస్య తలెత్తకుండా, క్యూలైన్లలో రద్దీ, తోపులాట లేకుండా పోలీసులు జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆర్టీసి, మెట్రోలు, ప్రధాన బస్‌స్టేషన్ల నుండి ప్రత్యేక సర్వీసులు నడిపించాలని కోరారు. చేప ప్రసాదం కోసం వచ్చేవారికి రాత్రి పూట ఇబ్బందులు లేకుండా లైటింగ్ ఏర్పాటు చేయాలని, మెడికల్ క్యాంప్, స్టేజి, బారికేడ్లు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్‌తో పాటు పరిసరాల్లో సిసి కెమెరాలు ఏర్పాటు చేయాలని చెప్పారు. గత సంవత్సరం కంటే మెరుగ్గా ఏర్పాట్లు చేయాలని అధికారులను ఆదేశించారు. సమావేశంలో మంత్రులు వాకిటి శ్రీహరి, అజారుద్దీన్, రాజ్యసభ సభ్యులు అనిల్‌కుమార్ యాదవ్, ఫిషరీస్ కార్పొరేషన్ చైర్మన్ మెట్టు సాయికుమార్, జిల్లా కలెక్టర్ ప్రియాంక ఆల ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## అక్రమంగా గోవులను తరలిస్తే ఉపేక్షించేది లేదు : సిఐ

**ప్రజాపక్షం/కొత్తూరు:** ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా, అక్రమంగా గోవులను తరలిస్తే ఉపేక్షించేది లేదని కొత్తూరు సిఐ నర్సయ్య హెచ్చరించారు. గురువారం స్థానిక పోలీస్ స్టేషన్ అవరణలో బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని శాంతి సంఘం సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ నర్సయ్య మాట్లాడుతూ బక్రీద్ పర్వదినాన్ని పురస్కరించుకొని అక్రమంగా గోవులు, మూగజీవాలను తరలిస్తే తక్షణమే సంబంధిత పోలీస్ స్టేషన్‌లో సమాచారం ఇవ్వాలని, ఎవరు కూడా చట్టాన్ని చేతుల్లోకి తీసుకోవద్దని సూచించారు. ప్రశాంత వాతావరణంలో పండుగలను నిర్వహించుకునేందుకు ప్రజలందరు కృషి చేయాలని పేర్కొన్నారు. అక్రమంగా మూగజీవాలను రవాణ చేయరాదని, ఎవరైన బలిస్తే వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జాతీయ రహదారులపై ప్రత్యేకంగా చెక్ పోస్టులను ఏర్పాటు చేయడం జరిదిందని, రైతులు ఎవరైన మూగజీవాలను తీసుకువెళ్తే అందుకు సంబంధించిన పత్రాలను చూపించాల్సి ఉంటుందని వివరించారు. కార్యక్రమంలో ఎస్ఐలు సత్యశీలారెడ్డి, గోపాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# తుదిదశకు స్విమ్మింగ్ పూల్ పనులు

ఎల్‌బినగర్ ఎంఎల్ఎ సుధీర్‌రెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** ఈత కొలనుతో ప్రజల ఆరోగ్యాలకు మెరుగైన ఫలితాలు ఉంటాయని, ఆరోగ్య పరంగా ఉండటానికి ఈత ఎంతో ఉపయోగకరమైందని ఎల్‌బినగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం హస్తినాపురం డివిజన్ పరిధిలోని జయకృష్ణ ఎన్‌క్లేవ్ నందు నిర్మాణంలో ఉన్న స్విమ్మింగ్ పూల్ పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్విమ్మింగ్ పూల్ పనులు తుదిదశకు చేరుకోవడం జరిగిందని తెలిపారు. త్వరలోనే ప్రారంభం కావడం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈత నేర్చుకోవడం వల్ల శారీరక దృఢత్వం పెరగడమే కాకుండా మానసిక ఉల్లాసం లభిస్తుందని నిపుణులు చెబుతున్నారన్నారు. స్విమ్మింగ్ పూల్‌లో డ్రెస్సింగ్ రూములు, ఫిల్టరేషన్ ప్లాంట్, వెయిటింగ్ హాల్, కోచ్ గది తదితర అధునిక సౌకర్యాలు కల్పించనున్నట్లు ఎంఎల్ఏ వెల్లడించారు. కార్యక్రమంలో అందోజు సత్యంచారి, చింతల రవికుమార్ గుప్తా, రమావత్ శ్రీనివాస్‌నాయక్, కొట్ర శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

# ఇందిరమ్మ ఇంటితో నిరుపేదలు ఆనందం

చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య



**ప్రజాపక్షం/షాబాద్:** ఇందిరమ్మ ఇంటితో నిరుపేదల్లో ఆనందం వ్యక్తమవుతుందని చేవెళ్ల ఎమ్మెల్యే కాలే యాదయ్య, జిల్లా గ్రంథాలయ సంస్థల చైర్మెన్ ఎలుగంటి మధుసుదన్ రెడ్డి అన్నారు. గురువారం షాబాద్ మండల పరిధిలోని మల్లారెడ్డి గూడ, పోతుగల్ గ్రామాల్లో ఇందిరమ్మ ఇండ్లను లబ్ధిదారులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజలకు ఇచ్చిన హామీలను రాష్ట్ర ప్రభుత్వం దశల వారీగా అమలు చేస్తుందన్నారు. ప్రతి గ్రామంలో నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్ల పథకం ద్వారా తగిన న్యాయం జరుగుతుందన్నారు. ప్రజల సంక్షేమంతో పాటు నిరుద్యోగులకు ఉపాధి అవకాశాలు కల్పించేందుకు ప్రజా ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తుందని వివరించారు. కార్యక్రమంలో గుడి మల్కాపూర్ వైస్ చైర్మన్ చంద్రశేఖర్, సర్దార్‌నగర్ మార్కెట్ చైర్మన్ పీసరి సురేందర్‌రెడ్డి, సర్పంచులు ప్రభాకర్‌రెడ్డి, చెన్నయ్య, పామెన నర్సింలు, సీనియర్ నాయకులు చేవెళ్ల స్వామి, వేంకటేష్, అంజనేయులు, గౌరీశ్వర్ తదితరులు పాల్గొన్నారు.

# రజకుల అభ్యున్నతికి కృషి



**ప్రజాపక్షం/షాద్‌నగర్:** తెలంగాణ రాష్ట్ర రజక సహకార కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దాసరిరాజు విజయ్‌కుమార్‌ను షాద్‌నగర్ ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్ సన్మానించారు. గురువారం హైదరాబాద్‌లోని దామోదర్ సంజీవయ్య భవన్‌లో తెలంగాణ రాష్ట్ర రజక సహకార కార్పొరేషన్ చైర్మన్‌గా బాధ్యతలు స్వీకరించిన దాసరి రాజు విజయ్‌కుమార్‌ను శాలువాలతో సత్కరించి అభినంధించారు. కార్పొరేషన్ ద్వారా రజకుల అభ్యున్నతికి కృషి చేయాల్సిన బాధ్యత ఉందన్నారు. అదే విధంగా తెలంగాణ రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమం, అభివృద్ధి కొరకు ప్రభుత్వ సలహాదారుగా నియమితులైన వి.హన్మంత్‌రావు బాధ్యతలు స్వీకరిస్తున్న నేపథ్యంలో మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. మాసాబ్ట్యాంక్, శాంతినగర్‌లోని ప్రధాన కార్యాలయంలో తెలంగాణ రాష్ట్ర గొర్రెలు, మేకల అభివృద్ధి సహకార సమాఖ్య లిమిటెడ్ చైర్మెన్‌గా బాధ్యతలు స్వీకరించిన సరిత తిరుపతయ్యలను సన్మానించి అభినంధించారు.

## అధికారుల నిర్లక్ష్యంతో నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు

మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి



**ప్రజాపక్షం/ఎల్‌బి నగర్ :** అధికారుల నిర్లక్ష్యంతో నత్తనడకన రోడ్డు నిర్మాణ పనులు నడుస్తున్నాయని మాజీ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అగ్రహం వ్యక్తం చేశారు. గురువారం డివిజన్ పరిధిలోని ఎన్జీవోస్ కాలనీ గణేష్ ఆలయం వద్ద జరుగతున్న రోడ్డు పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ స్థానిక కాలనీ వాసులు రోడ్డు పనులు సక్రమంగా చేపట్టకపోవడంతో కాలనీ ప్రజలు ఇబ్బందులు ఎదుకుంటున్నారన్నారు. ప్రజలకు అనుగుణంగా రోడ్డు పనులు పూర్తి చేయాల్సిన అధికారులు, కాంట్రాక్టర్‌లు, వారి ఇష్టసారంగా వ్యవహరించడం తో పనుల్లో జాప్యం జరుగుతుందన్నారు. అధికారుల నిర్లక్ష్యం వీడి పనులపై పర్యవేక్షణ చేసి త్వరగా రోడ్డు పనులు అయ్యే విధంగా చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు రవిశంకర్, సుధీర్ కుమార్, చిన్న యాదవ్ తదితరులు పాల్గొన్నారు.

# లక్ష్యాలు ఎంచుకొని విద్యనభ్యసిస్తే భవిష్యత్

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి






**ప్రజాపక్షం/షాద్‌నగర్:** విద్యార్థులు సామర్థ్య నైపుణ్యాలను పెంచుకోవడానికి విఐఐటి, జెఇఇ అకాడమీ సరైన వేదిక అవుతుందని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి అన్నారు. గురువారం షాద్‌నగర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన విఐఐటి, జెఇఇ అకాడమీ, జూనియర్ కళాశాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు లక్ష్యాలను ఎంచుకొని విద్యను అభ్యసిస్తే భవిష్యత్ బంగారు మయంగా ఉంటుందన్నారు. షాద్‌నగర్‌లో విఐఐటి, జెఇఇ అకాడమీ కేంద్రాలను ఏర్పాటు చేయడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో అకాడమీ యాజమాన్యం, కౌన్సిలర్ బిఎస్ సుధీర్, గౌస్ జానీ, అనిత రఘునాథ్ యాదవ్, విలేకరి మారం చందు, మాజీ జడ్పిటిసి కుమారుడు రామకృష్ణ, మహదేవ్‌పూర్ సర్పంచ్ అనూష రవీందర్‌రెడ్డి, మాజీ సర్పంచులు, బిఆర్ఎస్ నాయకులు నక్కల వెంకటేష్ గౌడ్, గోపాల్ నాయక్, శేరి శ్రీనివాస్‌రెడ్డి, దినేష్‌సాగర్, అల్లాడ శేఖర్‌పాల్గొన్నారు.

### అమ్మవారి కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు

**కేశంపేట:** అమ్మవారి కృపతో ప్రజలందరికీ ఆయురారోగ్యాలు లభించాలని ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం కేశంపేట మండల పరిధిలోని లింగంధన గ్రామంలో పోచమ్మ అమ్మవారి విగ్రహ ప్రతిష్ట పూజా కార్యక్రమంలో ఎమ్మెల్సీ నవీన్‌కుమార్‌రెడ్డి పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలోలక్ష్మీ నారాయణ గౌడ్, లింగంధన సర్పంచ్ నాగిళ్ళ వెంకటేష్, ఉప సర్పంచ్ లావణ్య తిరుపతిరెడ్డి, పోమాల్‌పల్లి సర్పంచ్ స్వప్న భూపాల్‌రెడ్డి, పొల్లంగుట్ట సర్పంచ్ భాస్కర్ నాయక్, లేమామిడి సర్పంచ్ సులోచన శ్రీనివాస్, సుందరపూర్ సర్పంచ్ భారతి రవి నాయక్, నాయకులు యారం శేఖర్‌రెడ్డి, శేఖర్ పంతులు, కృష్ణయ్య, గోగు వెంకట్ నారాయణరెడ్డి, రాంచందర్, ఉయారం రాంరెడ్డి, ప్రమోద్‌రెడ్డి పాల్గొన్నారు.

# ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతంగా పూర్తిచేయాలి

కలెక్టర్ సి.నారాయణరెడ్డి ఆదేశం






**ప్రజాపక్షం/రంగారెడ్డి:** ధాన్యం కొనుగోలులో రైతులు ఇబ్బందులు ఎదుర్కోకుండా ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని రంగారెడ్డి జిల్లా కలెక్టర్ సి.నారాయణరెడ్డి సంబందిత అధికారులను ఆదేశించారు. గురువారం రంగారెడ్డి జిల్లా కందుకూర్ మండలంలో ఏర్పాటు చేసిన వరి, మొక్కజొన్న కొనుగోలు కేంద్రాలను కలెక్టర్ ఆకస్మికంగా సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోలు ప్రక్రియ, లోడింగ్, లిఫ్టింగ్ పనుల పురోగతిని కలెక్టర్ అధికారులను అడిగి తెలుసుకున్నారు. కొనుగోలు చేసిన ధాన్యాన్ని ఆలస్యం లేకుండా కాంటా వేసి మిల్లులకు తరలించే చర్యలు చేపట్టాలన్నారు. తేమశాతం, నాణ్యత ప్రమాణాల పరిశీలనలో పారదర్శకత పాటించాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలలో అవసరమైన గన్ని బ్యాగులను, టార్పలిన్‌లను అందుబాటులో ఉండే విధంగా చర్యలు చేపట్టాలని సూచించారు. పర్యటనలో కందుకూర్ ఆర్డీఓ జగదీశ్వర్‌రెడ్డి, తహసీల్దార్, మార్క్ ఫడ్ అధికారి, మండల వ్యవసాయ అధికారి పాల్గొన్నారు..

### గడువులోపు ఇంటింటి సర్వే ప్రక్రియ పూర్తి

ఇంటింటి సర్వే ప్రక్రియను అధికారులు నిర్దేశిత గడువులోపు చేయాలని కలెక్టర్ నారాయణరెడ్డి ఆదేశించారు. కందుకూర్ మండలంలో జన గణనలో భాగంగా నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే ప్రక్రియను కలెక్టర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంటింటి సర్వే నిర్వహణ, వివరాల నమోదు, డేటా సేకరణ ప్రక్రియలను కలెక్టర్ సి నారాయణ రెడ్డి పరిశీలించి సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు.

### ప్రభుత్వ పాఠశాల విద్యార్థులే అన్నిరంగాల్లో రాణిస్తున్నారు

ప్రభుత్వ పాఠశాలలో చదివిన విద్యార్థులే అని రంగాల్లో రాణిస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసుకుంటూ, అధిక సంఖ్యలో విద్యార్థులు చేరే విధంగా కృషి చేయాలని కలెక్టర్ సి.నారాయణరెడ్డి అన్నారు. ప్రజా పాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమాల్లో భాగంగా ఈ నెల 13వ తేదీ నుండి ప్రారంభమయిన విద్యా వారోత్సవాలలో భాగంగా గురువారం జయశంకర్ బడిబాట, పేరెంట్ టీచర్ మీటింగ్‌ను కందుకూర్ మండలం నేదునూర్ తెలంగాణ మోడల్ స్కూల్, జూనియర్ కాలేజీలో నిర్వహించిన కార్యక్రమంలో కలెక్టర్ నారాయణరెడ్డి పాల్గొన్నారు. ఈ సందర్భంగా 10వ తరగతి, ఇంటర్మీడియట్‌లో ఉత్తీర్ణత సాధించిన విద్యార్థినిలను కలెక్టర్ సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో నేదునూర్ మోడల్ స్కూల్ ప్రిన్సిపాల్ విష్ణుప్రియా, తహసీల్దార్ గోపాల్, ఎంఇఒ తదితరులు పాల్గొన్నారు.

### ఓటరు జాబితా సవరణ విజయవంతం చేయాలి

రాష్ట్ర ఎన్నికల సంఘం విడుదల చేసిన ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ షెడ్యూల్ అమలుపై కలెక్టర్ గురువారం జిల్లాలోని అన్ని ఎన్నికల నమోదు అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజాస్వామ్య వ్యవస్థలో ఓటరు జాబితా అత్యంత కీలకమైందని, పారదర్శకంగా, ఖచ్చితత్వంతో, సమగ్రతతో ఓటరు జాబితా తయారు చేయడం ప్రతి ఎన్నికల అధికారుల బాధ్యత అని పేర్కొన్నారు. ప్రత్యేక సమగ్ర ఓటరు జాబితా సవరణ కార్యక్రమంలో చురుకుగా పాల్గొని సహకరించాలని కలెక్టర్ ప్రజలకు విజ్ఞప్తి చేశారు. ఓటరు జాబితా పరిశుభ్రత, పారదర్శకత, ప్రజాస్వామ్య బలోపేతానికి ప్రతి ఒక్కరూ తమ వంతు బాధ్యత నిర్వర్తించాలని కోరారు. వీడియో కాన్ఫరెన్స్‌లో జిల్లా ఎన్నికల విభాగ అధికారులు, ఇఆర్ఒ లు, ఎఇఆర్ఒలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

## కల్లు దుకాణం మూసివేయాలి



**ప్రజాపక్షం/బంజారాహిల్స్:** గుడి మార్గంలో ఏర్పాటు చేసిన కల్లు కంపౌండ్‌ను వెంటనే మూసివేయాలని బిఆర్ఎస్ ఖైరతాబాద్ అసెంబ్లీ సెగ్మెంట్ ఇంచార్జి మన్నె గోవర్ధన్‌రెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బంజారాహిల్స్ డివిజన్ పరిధిలోకి వచ్చే ప్రేంనగర్ నుంచి చింతల్‌బస్తి టూ సాయిబాబా గుడి రోడ్డులో కల్లు కంపౌండ్ ఓపెన్ చేయడాన్ని వ్యతిరేకిస్తూ బస్తీ మహిళలు, యువకులు నిర్వహించిన ధర్నాలో మన్నె గోవర్ధన్‌రెడ్డి పాల్గొని ప్రసంగించారు. కల్లు కంపౌండ్ ఏర్పాటు చేసిన రహదారి నుంచి ఆనంద్‌నగర్ కాలనీ, వెంకటరమణ కాలనీ ప్రజలు రాకపోకలు సాగిస్తుంటారని.. కల్లు కంపౌండ్ ఏర్పాటుతో తీవ్ర సమస్యలు తలెత్తుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. వెంటనే కల్లు కాంపౌండ్‌ను మూసివేయాలని ఆయన డిమాండ్ చేశారు. ధర్నాలో బిఆర్ఎస్ నాయకులు, విప్లవ్ కుమార్, విజయ్, నవీన్, శ్రీధర్ యాదవ్, ప్రవీణ్, శివరాజ్, నరేష్, స్థానిక నాయకులు, మహిళలు, యువకులు పాల్గొన్నారు.

## జన గణన పరిశీలన



**ప్రజాపక్షం/చార్మినార్:** జన గణన జరుగుతున్న తీరును చార్మినార్ జెడ్‌సి కే.సత్యనారాయణ పరిశీలించారు. ఈ మేరకు గురువారం మధ్యాహ్నం చార్మినార్ సర్కిల్ పరిధిలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించి ఎన్యూమరేటర్లతో ఆరా తీశారు. ఈ సందర్భంగా జెడ్‌సి సత్యనారాయణ మాట్లాడుతూ... ఎన్యూమరేటర్లు జనగణన ప్రక్రియను సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ప్రతి ఇంటిని సందర్శించి పూర్తి వివరాలు సేకరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలు తమ ఇంటి వద్దకు వచ్చే ఎన్యూమరేటర్లకు సహకరించి సరైన సమాచారం అందించాలని కోరారు. జెడ్‌సి వెంట చార్మినార్ డిసి సరిత, వివిధ విభాగాలకు చెందిన అధికారులు, సూపర్‌వైజర్లు, ఎన్యూమరేటర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

## ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో హైడ్రా కీలకం



**ప్రజాపక్షం/జూబ్లీహిల్స్:** ప్రభుత్వ స్థలాల పరిరక్షణలో హైడ్రా కమిషనర్ రంగనాథ్ పాత్ర అభినందనీయమని వెంగళరావునగర్‌కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ చైర్మన్ డా.రవిశేఖర్‌రెడ్డి అన్నారు. గురువారం రవిశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్, సీనియర్ సిటిజన్స్ మధురానగర్‌లోని నివాసంలో హైడ్రా కమిషనర్ రంగనాథ్‌ను కలిసి శాలువాకప్పి సన్మానించారు. ఈ సందర్భంగా అక్రమ కట్టడాలు కూల్చివేయడం, ఆక్రమిత భూములను రక్షించడంలో హైడ్రా గొప్ప విజయాలను సాధిస్తున్నదని డాక్టర్ రవిశేఖర్‌రెడ్డి కొనియాడారు. ఈ సందర్భంగా రంగనాథ్ మాట్లాడుతూ, వెంగళరావునగర్ కాలనీ సోషల్ వెల్ఫేర్ కాలనీ ప్రజలందరికీ ఎల్లవేళలా అందుబాటులో ఉంటూ.. కాలనీ అభివృద్ధికి పాటుపడాలని సూచించారు. రంగనాథ్‌ను కలిసిన వారిలో వెంగళరావునగర్ కాలనీ సోషల్ వెల్ఫేర్ అసోసియేషన్ ప్రతినిధులు రిటైర్డ్ సూపరిండెంట్ ఆఫ్ జైల్స్ ఎం.రంగారావు, హైకోర్ట్ న్యాయవాది లక్ష్మీ కాంతరావు, ప్రొఫెసర్ టివి రెడ్డి, నాగరాజు, కుటుంబరావు, కాలనీ సీనియర్ సిటిజెన్ అసోసియేషన్ ప్రెసిడెంట్ బాలకృష్ణ తదితరులు ఉన్నారు.

## అందుబాటులోకి డిజిటల్ పాథాలజీ వ్యవస్థ




**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** భారత దేశంలోనే మొట్టమొదటి సారిగా 240 స్లయిడ్ స్కానర్‌తో కూడిన డిజిటల్ పాథాలజీ వ్యవస్థను రోగులకు బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ హాస్పిటల్, రీసెర్చి ఇనిస్టిట్యూట్ అందుబాటులోకి తీసుకువచ్చింది. ఐసిఐసిఐ ఫౌండేషన్ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఈ అధునాతన వ్యవస్థను గురువారం ట్రస్ట్ చైర్మన్ బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... రోగులకు అత్యాధునిక వైద్య వ్యవస్థలను అందుబాటులోకి తెచ్చి ప్రపంచ శ్రేణి చికిత్సను అందించడంలో ఎప్పుడూ ముందంజలో ఉండే బసవతారకం ఇండో అమెరికన్ క్యాన్సర్ ఆసుపత్రి మరో ఆదునిక వ్యాధి నిర్ధారణ వ్యవస్థను ప్రవేశపెట్టినట్లు తెలిపారు. ముందుగా ల్యాబొరేటరీ మెడిసన్, పాథాలజీ విభాగం హెడ్ డా.సుశీల కోదండపాణి నూతనంగా ఏర్పాటు చేసిన డిజిటల్ పాథాలజీ వ్యవస్థకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. కార్యక్రమంలో ట్రస్ట్ సభ్యులు డాక్టర్.నోరి దత్తాత్రేయుడు, జెయస్ఆర్ ప్రసాద్, డాక్టర్ టియస్‌రావు, మెడికల్ సూపరింటెండెంట్ డాక్టర్ ఫణి కోటేశ్వరరావు, డాక్టర్ కల్పనా రఘునాథ్ తదితరులు పాల్గొన్నారు.

## విహెచ్ బాధ్యతల స్వీకరణ



**ప్రజాపక్షం/అబిడ్స్:** తెలంగాణ రాష్ట్ర సచివాలయంలో తెలంగాణ ప్రభుత్వ బీసీ సంక్షేమ శాఖ ప్రభుత్వ సలహాదారుగా సీనియర్ కాంగ్రెస్ నాయకులు వి.హనుమంతరావు అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంలో పలువురు సీనియర్ నాయకులు, ప్రజాప్రతినిధులు విహెచ్‌కు హృదయపూర్వక అభినందనలు, శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లింగ్విస్టిక్ మైనారిటీ సెల్ చైర్మన్ రాజేష్ కుమార్ అగర్వాల్, అవినాష్ తదితరులు పాల్గొన్నారు.

# 24న తాటి మ్యూజికల్ ఫెస్టివల్

### పోస్టర్ ఆవిష్కరించిన మంత్రి పొన్నం



**ప్రజాపక్షం/ఖైరతాబాద్:** ప్రకృతి సిద్ధమైన తాటి కల్లు విశిష్టతను ప్రపంచానికి చాటిచెప్పేలా మే 24వ తేదీన చిలుకూరి బాలాజీ దగ్గరలో తాటి మ్యూజికల్ ఫెస్టివల్ ఎక్స్‌పీరియమ్ నిర్వహిస్తున్నట్లు నిర్వాహకుడు రాందేవ్ తెలిపారు. ఈ మేరకు గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో పోస్టర్, తాటి నీరా బాటిళ్లను మంత్రి పొన్నం ప్రభాకర్, ఎమ్మెల్సీ గోరేటి వెంకన్న, మాజీ మంత్రి శ్రీనివాస్ గౌడ్, మాజీ ఎంపీ బూర నర్సయ్య గౌడ్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరై ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. తాటికల్లు కేవలం పానీయం మాత్రమే కాదని, అది ఆరోగ్య ప్రదాయిని అని కొనియాడారు. తాటికల్లు ప్రకృతి ప్రసాదించిన అమృతం అని తెలిపారు. కిడ్నీలో రాళ్లు ఉన్నవారికి ఇది అద్భుతమైన ఔషధంగా పనిచేస్తుందని శాస్త్రీయ ఆధారాలు ఉన్నాయని అన్నారు. చిలుకూరు బాలాజీ రూట్లో ప్రముఖ వ్యాపారవేత్త రాందేవ్ 150 ఎకరాల విస్తీర్ణంలో రూ.500 కోట్ల వ్యయంతో ఈ ఎక్స్‌పీరియం పార్క్'ను ఏర్పాటు చేశారని అన్నారు. మే 24న జరిగే వేడుక కోసం వివిధ దేశాల నుంచి సేకరించిన 500 అరుదైన తాటి చెట్లను రూ.10 కోట్ల ఖర్చుతో ఇక్కడ నాటుతున్నట్లు ఆయన తెలిపారు. ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సూచనల మేరకు, రాజకీయాలకు అతీతంగా గీతవృత్తిని ప్రోత్సహించేందుకు ఈ కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినట్లు తెలిపారు. తాటికల్లును తెలంగాణ అధికారిక డ్రింక్‌గా గుర్తించాలని నిర్వాహకులు కోరారని, దీనిపై ప్రభుత్వంలో చర్చిస్తామని మంత్రి హామీ ఇచ్చారు. రాష్ట్రంలోని ప్రధాన హోటళ్లలో కూడా తాటికల్లును అందుబాటులోకి తెచ్చేలా చర్యలు తీసుకుంటామన్నారు. ఈజీఎస్ కింద రాష్ట్రవ్యాప్తంగా తాటి, ఈత వనాలను పెంచుతున్నామని, గ్రామ నర్సరీల్లోనూ వీటి పెంపకానికి ప్రాధాన్యత ఇస్తామని మంత్రి పొన్నం తెలిపారు. గీత వృత్తిని నమ్ముకున్న వారు, ప్రకృతి ప్రేమికులు మే 24న జరిగే ఈ మేళాలో పెద్ద ఎత్తున పాల్గొని విజయవంతం చేయాలని ఈ సందర్భంగా పిలుపునిచ్చారు.

## బండి భగీరథను అరెస్ట్ చేయాలి




**ప్రజాపక్షం/ఫలక్‌నుమా:** బండి భగీరథ్‌ను వెంటనే అరెస్ట్ చేయాలని డివైఎఫ్ఐ హైదరాబాద్ సౌత్ జిల్లా కార్యదర్శి కృష్ణ నాయక్ డిమాండ్ చేశారు. ఈ మేరకు భారత ప్రజాతంత్ర యువజన సమాఖ్య ఆధ్వర్యంలో ఫలక్‌నుమా రైల్వే స్టేషన్ అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా కృష్ణ నాయక్ మాట్లాడుతూ, అధికార అహంకారంతో తన కుమారుడు చేసిన నేరాన్ని కప్పిపుచ్చుకునేందుకు బండి సంజయ్ ప్రయత్నిస్తున్నారని, మహిళల భద్రతను తాకట్టు పెట్టడమేనన్నారు. తక్షణమే ప్రభుత్వం స్పందించి బండి భగీరథ్‌ను అరెస్టు చేసి రిమాండ్ చేయాలని, బాధిత కుటుంబానికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో డిజిపి కార్యాలయాన్ని ముట్టడిస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో శ్రీను, భారత్, రాము, మహేష్, ఆశిన్ తదితరులు పాల్గొన్నారు.

### ఖరీదైన మద్యం పేరుతో చీప్ లిక్కర్ విక్రయాలు..

# మిక్సింగ్ మద్యం ముఠా గుట్టురట్టు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రముఖ బ్రాండ్ల ఖరీదైన మద్యం పేరుతో చీప్ లిక్కర్‌ను మిక్స్ చేసి సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు విక్రయిస్తున్న ముఠాను రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు అరెస్ట్ చేశారు. ఈ దాడుల్లో రూ.3 లక్షలకు పైగా విలువ చేసే మిక్సింగ్ మద్యం, ఖరీదైన బ్రాండ్ల ఖాళీ సీసాలు, క్యాపులు స్వాధీనం చేసుకున్నారు. రంగారెడ్డి ఎన్‌ఫోర్స్‌మెంట్ సిఐ సుభాష్ చంద్ర, ఎస్సై అఖిల్ ఆధ్వర్యంలో నిర్వహించిన దాడుల్లో ఒడిశాకు చెందిన లాలూ ప్రసాద్ బిశ్వాల్, రాజేశ్వర్ మెహర్, కరీంనగర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శరత్ చంద్ర ఈ ముఠాలో ఉన్నట్లు గుర్తించారు. వీరిలో లాలూ ప్రసాద్ బిశ్వాల్, శరత్ చంద్రను అరెస్ట్ చేసి కొండాపూర్ ఎక్సైజ్ స్టేషన్‌కు అప్పగించారు. మరో నిందితుడిపై కేసు నమోదు చేసి విచారణ కొనసాగిస్తున్నారు. పోలీసుల వివరాల ప్రకారం.. లిక్కర్ ఈవెంట్లలో పనిచేసే లాలూ ప్రసాద్, రాజేశ్వర్ మెహర్‌లు బడా బాబుల పార్టీల్లో వినియోగించిన ఖరీదైన మద్యం సీసాలను సేకరించేవారు. అనంతరం వాటిలో ఐకాన్ వంటి చీప్ లిక్కర్‌తో పాటు కొద్దిపాటి నీటిని కలిపి మళ్లీ ఖరీదైన బ్రాండ్ల మద్యం మాదిరిగా తయారు చేసేవారు. ఈ మిక్సింగ్ మద్యాన్ని అత్తాపూర్‌కు చెందిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి శరత్ చంద్ర సహకారంతో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులకు తక్కువ ధరలకు విక్రయిస్తూ భారీగా లాభాలు ఆర్జిస్తున్నట్లు అధికారులు వెల్లడించారు. కొండాపూర్ పరిధిలోని గుట్టల బేగంపేటలో ఓ గదిని అద్దెకు తీసుకుని ఈ అక్రమ వ్యాపారం నిర్వహిస్తున్నట్లు గుర్తించారు. రూ.25,100 విలువైన రాయల్ సెల్యూట్ బాటిల్‌ను రూ.8 వేలకే, రూ.9,090 విలువైన శివాస్ రీగల్‌ను రూ.4 వేలకే, రూ.7,190 విలువైన గ్లెన్‌ఫిడిక్ బాటిల్‌ను రూ.3 వేలకే విక్రయిస్తున్నట్లు విచారణలో తేలింది. అసిస్టెంట్ కమిషనర్ ఆర్. కిషన్ మాట్లాడుతూ.. తక్కువ ధరలకు ఖరీదైన మద్యం పేరుతో విక్రయాలు చేస్తున్న వారిని ప్రజలు నమ్మవద్దని హెచ్చరించారు. ఇలాంటి అక్రమ మద్యం విక్రయాలను ఎట్టి పరిస్థితుల్లోనూ ప్రోత్సహించవద్దని సూచించారు.ఈ దాడుల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ సిబ్బంది రాజేష్, శంకర్, అనసూయ, శ్యాములు పాల్గొన్నారు.

## ఇఒ సుధాకర్‌కు ఘనంగా సన్మానం



**ప్రజాపక్షం/వెంగళరావునగర్:** జిటిఎస్ కాలనీలోని వీరాంజనేయ భవానీశంకర అయ్యప్ప స్వామి సాయిబాబా దేవాలయంలో ఎంతోకాలంగా పనిచేస్తున్న తమకు జీతాలు పెరగడం పట్ల సిబ్బంది సంతోషం వ్యక్తం చేశారు. జీతాలు పెంచిన సందర్భంగా ఆలయ ఈవో గుమ్మడిదళ సుధాకర్‌ను సిబ్బంది గురువారం ఘనంగా సన్మానించారు. ఎంతో కాలంగా తాము ఎదురుచూస్తున్న జీతాల పెంపుతో ఆనందం వ్యక్తం చేస్తూ, ఆలయ అర్చకులు సహా అందరికీ సమానంగా ప్రతి నెల పదకొండు వేల రూపాయలు జీతంగా ఇవ్వడం ప్రారంభించారని సిబ్బంది తెలిపారు.

## 'నన్హే ఫరిష్తే'తో చిన్నారులను రక్షించిన ఆర్‌పిఎఫ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** ప్రయాణికుల భద్రత, రైల్వే ఆస్తుల పరిరక్షణతో పాటు తప్పిపోయిన చిన్నారులను కుటుంబాలకు చేర్చే మానవతా కార్యక్రమాల్లో దక్షిణ మధ్య రైల్వే రైల్వే రక్షణ దళం (ఆర్‌పిఎఫ్) విశేష సేవలు అందిస్తోంది. ఏప్రిల్ నెలలో నిర్వహించిన ప్రత్యేక ఆపరేషన్ల ద్వారా ఆర్‌పిఎఫ్ పలు రంగాల్లో గణనీయమైన విజయాలు నమోదు చేసింది. ముఖ్యంగా 'ఆపరేషన్ నన్హే ఫరిష్తే' కింద 120 మంది చిన్నారులను రక్షించి చైల్డ్ వెల్ఫేర్ కమిటీకి అప్పగించడం ప్రాధాన్యత సంతరించుకుంది. రైల్వే ప్రయాణాలను సురక్షితంగా మార్చడమే లక్ష్యంగా ప్రభుత్వ పోలీసు శాఖలు, ఇతర చట్ట అమలు సంస్థలతో కలిసి ఆర్‌పీఎఫ్ సమన్వయంగా పనిచేస్తోంది. ప్రయాణికుల ఆస్తుల రక్షణ నుంచి మత్తు పదార్థాల అక్రమ రవాణా అరికట్టడం వరకు వివిధ విభాగాల్లో ప్రత్యేక ఆపరేషన్లు చేపట్టి ఫలితాలు సాధించింది.ఆపరేషన్ యాత్రి సురక్ష కింద 79 మంది నేరస్థులను అరెస్టు చేసి, 71 కేసులు నమోదు చేశారు. రూ.54.52 లక్షల విలువైన దొంగిలించబడిన ఆస్తులను రికవరీ చేశారు. ఆపరేషన్ అమానత్ ద్వారా ప్రయాణికులు కోల్పోయిన రూ.83.35 లక్షల విలువైన 319 వస్తువులను గుర్తించి యజమానులకు తిరిగి అందజేశారు. మత్తు పదార్థాల అక్రమ రవాణాపై నిర్వహించిన ఆపరేషన్ నార్కోస్‌లో రూ.86.17 లక్షల విలువైన గంజాయిని స్వాధీనం చేసుకుని 16 మందిని అరెస్టు చేశారు. ఆపరేషన్ ఆహాత్‌లో మానవ అక్రమ రవాణాదారుల బారిన పడిన ఐదుగురు బాలురను రక్షించి ఇద్దరు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. అలాగే ఆపరేషన్ జీవన్ రక్షలో అప్రమత్తంగా స్పందించిన ఆర్‌పీఎఫ్ సిబ్బంది ఒక వ్యక్తి ప్రాణాన్ని కాపాడారు. ఆపరేషన్ సతర్క్‌లో రూ.2.47 లక్షల విలువైన అక్రమ మద్యాన్ని పట్టుకుని ఎక్సైజ్ శాఖకు అప్పగించగా, ఒక వ్యక్తిపై 12 కేసులు నమోదయ్యాయి. టికెట్ దళారులపై చేపట్టిన ఆపరేషన్ ఉపలబ్ధ్‌లో 26 మంది దళారులను అరెస్టు చేసి, రూ.2.21 లక్షల విలువైన 66 టికెట్లను స్వాధీనం చేసుకున్నారు. సిసిటివి సాంకేతికత సాయంతో 11 మంది నేరస్థులను గుర్తించి, ప్రయాణికుల నుంచి దొంగిలించిన రూ.26.65 లక్షల విలువైన ఆస్తులను రికవరీ చేశారు. ఇక ఆపరేషన్ రైల్ సురక్షలో భాగంగా 36 కేసులను గుర్తించి రూ.6.03 లక్షల విలువైన రైల్వే ఆస్తులను తిరిగి స్వాధీనం చేసుకున్నారు. ప్రజల భద్రత, రైల్వే రక్షణలో ఆర్‌పిఎఫ్ అప్రమత్తంగా పనిచేస్తోందని దక్షిణ మధ్య రైల్వే అధికారులు తెలిపారు.

## టిజిఎఫ్‌డిసి ఆర్థికంగా బలోపేతమైంది

### ఎండి సునీత ఎం భగవత్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** 'తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ (టిజిఎఫ్‌డిసి) అనేక విభాగాల్లో ఆర్థికంగా బలోపేతమైన ప్రభుత్వ రంగ సంస్థగా ఎదిగిందని సంస్థ వైస్ ఛైర్మన్, ఎండి సునీత ఎం భగవత్ పేర్కొన్నారు. తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ 11వ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకొని కొండాపూర్‌లోని బోటానికల్ గార్డెన్‌లో నిర్వహించిన కార్యక్రమంలో సిబ్బందితో కలిసి సునిత మొక్కలు నాటారు. అనంతరం కేక్ కట్ చేసి సునిత సిబ్బందిని, పాలనా అధికారులని ఉద్దేశించి మాట్లాడుతూ అటవీ ఆధారిత పరిశ్రమలు, ప్రకృతి పర్యాటకం, పునరుత్పాదక ఇంధన, సిఎస్ఆర్ కార్యకలాపాలలో తన విశిష్టతను నిరూపించుకుందని, వాటి మొత్తానికి కారణం అంకిత భావంతో పనిచేసే తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ ఉద్యోగులేనని వారు కొనియాడారు'. ముఖ్యంగా నూతనంగా తెలంగాణ ప్రభుత్వం రూపొందించిన ఎకో టూరిజం కు నోడల్ ఏజెన్సీ గా తెలంగాణ అటవీ అభవృద్ధి సంస్థ యొక్క కొత్త ఎకో టూరిజం బ్రాండ్ అయినటువంటి 'డెక్కన్ వుడ్స్ అండ్ ట్రయల్స్' పేరిట బోటానికల్ గార్డెన్, హైదరాబాద్ లో గల అర్బన్ పార్క్ లు, ది బ్రీజ్ అనంతగిరి హిల్స్, మన్ననూరు జంగల్ రిసార్ట్స్ అమ్రాబాద్ టైగర్ రిజర్వ్ వంటి ప్రకృతి పర్యాటక ఎకో టూరిజం రిసార్ట్స్‌ను నిర్వహిస్తూ వచ్చిన వారికి అటవీ, వన్యప్రాణి సంరక్షణ గూర్చి వివరిస్తూ, పర్యావరణ హిత పర్యాటకాన్ని ప్రోత్సహిస్తూ, అడవులు, వన్యప్రాణులు, పర్యావరణ స్థిరత్వం యొక్క ప్రాముఖ్యతను చాటిచెబుతోంది. రాబోయే రోజుల్లో సిబ్బంది అదే ప్రోత్సాహం తో మరింత అంకిత భావంతో పనిచేసి, తెలంగాణ అటవీ అభివృద్ధి సంస్థ బలోపేతానికి మరింత కృషి చేయాలని వారు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం లో చీఫ్ జనరల్ మేనేజర్ డి.వెంకటేశ్వర్ రెడ్డి, జెనరల్ మేనేజర్ డాక్టర్.జి. స్కెలాబ్, సీనియర్ డివిజినల్ మేనేజర్, అసిస్టెంట్ డైరెక్టర్ ఎకో టూరిజం కె. శిరీష, విజిలేన్స్ జనరల్ మేనేజర్ సయ్యద్ మక్సూద్, జనరల్ మేనేజర్ రవీందర్ రెడ్డి, ఫైనాన్సియల్ కంట్రోలర్ కిరణ్ కుమార్, ప్లాంటేషన్ మేనేజర్లు లక్ష్మారెడ్డి, రాజేంద్ర కుమార్, ప్రాజెక్ట్స్ మేనేజర్ కె.సుమన్, బోటనిస్ట్ డాక్టర్.ఐ. వీర కిషోర్. నేచురలిస్ట్ శాంసన్ రాజు, హాజీ బాషా, నరసింహులు, తదితరులు పాల్గొన్నారు.

## సర్వే నంబర్లు మార్చి రిజిస్ట్రేషన్?

### మున్సిపల్ పర్మిషన్ రద్దు చేయాలని డిప్యూటీ కమిషనర్‌కు ఫిర్యాదు

### విలేకరుల సమావేశంలో బోమ్మక్ సాయికిరణ్

**ప్రజాపక్షం/బోడుప్పల్:** సర్వే నంబర్లలో మార్పులు చేసి అక్రమంగా రిజిస్ట్రేషన్ చేసుకొని నిబంధనలకు విరుద్ధంగా పొందిన మున్సిపల్ పర్మిషన్‌ను వెంటనే రద్దు చేయాలని బోమ్మక్ సాయికిరణ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు బోడుప్పల్ సర్కిల్ కార్యాలయంలో డిప్యూటీ కమిషనర్‌కు వ్రాతపూర్వకంగా ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ విషయంపై నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, గతంలో సర్వే నంబర్లు 149, 150, ఫ్లాటు నెంబర్ 12 తో రిజిస్ట్రేషన్ జరిగిన భూమిని, అనంతరం కేవలం 149 సర్వే నంబర్‌తో మళ్లీ రిజిస్ట్రేషన్ చేసినట్లు ఆరోపించారు. సర్వే నంబర్ 150 వక్ఫ్ భూమిగా ఉన్నప్పటికీ దానిని దాచిపెట్టి రికార్డుల్లో మార్పులు చేసి పర్మిట్ నెం: 3467/ జిహెచ్ఎంసి/ ఎస్డబ్ల్యూబిపి/ యూపిల్2/2026, తేదీ:13 ఏప్రిల్ 2026 న అనుమతులు పొందారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై పూర్తి స్థాయి విచారణ జరిపి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, సంబంధిత నిర్మాణ అనుమతులను రద్దు చేయాలని అధికారులను కోరినట్లు తెలిపారు. భూ రికార్డులు, రిజిస్ట్రేషన్ వివరాలు, మున్సిపల్ అనుమతులపై సమగ్ర దర్యాప్తు జరిపితే అసలు నిజాలు వెలుగులోకి వస్తాయని ఆయన అన్నారు. అక్రమాలు నిరూపితమైతే సంబంధిత అధికారులపైనా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

## ఘనంగా బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి జన్మదిన వేడుకలు

**ప్రజాపక్షం / కుత్బుల్లాపూర్:** మున్నూరు కాపు కార్పొరేషన్ చైర్మన్ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి జన్మదిన వేడుకలు గురువారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా బిసి రాష్ట్ర నాయకులు తెల్ల హరికృష్ణ శాలువాతో సన్మానించి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. అనంతరం తెల్ల హరికృష్ణ మాట్లాడుతూ బొమ్మ శ్రీరామ్ చక్రవర్తి సామాజిక సేవా దృక్పథంతో మున్నూరు కాపు వర్గాల అభ్యున్నతికి కృషి చేస్తున్నారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో మున్నూరు కాపు సంఘం పటేల్స్ మేడ్చల్ మల్కాజ్‌గిరి జిల్లా ప్రధాన కార్యదర్శి పోతుల రాజేందర్, రాకేష్, నరేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

### ఖరీఫ్ సాగు ప్రణాళిక అంచనాలు సిద్ధం చేసిన వ్యవసాయశాఖ

# ఎరువులు 75.437 మెట్రిక్‌టన్నులు అవసరం

**ప్రజాపక్షం /వికారాబాద్:** జిల్లా వ్యాప్తంగా వ్యవసాయశాఖ ఖరీఫ్ సాగుకు కసరత్తు ప్రారంభించింది. క్షేత్రస్థాయిలో అధికారులు అనుబంధ శాఖల అధికారులతో సంప్రదించి ప్రణాళికలో అనుసరించాల్సిన విషయాలను చర్చించింది. ఎరువుల విషయానికొస్తే డీఏపీ 17.719 మెట్రిక్ టన్నులు ,యురియా32.329 మెట్రీక్ టన్నులు ,కాంప్లెక్స్ 19. 877 మెట్రిక్ టన్నులు ,ఎంఓపి 3.658 మెట్రీక్ టన్నులు ,ఎస్ఎస్‌పీ 1.854 మెట్రీక్ టన్నులు అవసరం అవుతాయని అధికారులు అంచనా వేశారు. ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి75.437 మెట్రిక్ టన్నుల ఎరువులు ,54.2400 క్వింటళ్ల విత్తనాలు కావాల్సి ఉంటుందని అంచనాలు సిద్ధం చేశారు. గత సీజన్‌లో సాగు విస్తీర్ణం ఎంత ,ఏయే పంటలు ఎంత మేర సాగుయ్యాయి. ఈ సీజన్‌లో ఏయే పంటలు సాగు విస్తీర్ణం పెంచాలి ,ఎపంటలు తగ్గించాలి రైతులకు ఏ అంశాలపై అవగాహన కల్పించాఇ అనే విషయాలు చర్చించారు. డివిజన్లు ,మండలాలవారీగా కావాల్సిన ఎరువులు అందుబాటులో ఉంచాల్సిన ఎరువులలు వంటివాటిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. భూసార పరీక్షలు ,విత్తనాల ఎంపిక నాణ్యమైన విత్తాల కొనుగోలు అందుబాటులో ఉన్న ఎరువులు తదితర వివరాలు రైతులకు తెలియజేల్సింటుందని ,అలాగే రైతు చైతన్య యాత్రలు ఉంటాయా ,ఉండవా అనే దానిపై అధికారులు ఇప్పటివరకు స్పష్టత ఇవ్వడంలేదు, ప్రస్తుతంప్రజాపాలన ప్రగతి ప్రణాళిక కార్యక్రమం ఇందులో భాగంగా మే చివరి వారం లేదా జున్ మొదటి వారంలో రైతు అవగాహన సదస్సులు నిర్వహించాలని ప్రభుత్వం నిర్ణయించినట్లు సమాచారం , నకిలీ విత్తనాలు ,పురుగుమందుల పై రైతులను అప్రమత్తం చేసే కార్యచరణ రుపొందిస్తున్నారు. ఇప్పటికే మార్కెట్ లో కొందరు వ్యాపారులు బీటీ3పత్తి విత్తనాలను గుట్టుగా విక్రయించేందుకు తిరుగుతున్నారు.గతంలో ప్రభుత్వమే పలు రకాల విత్తనాలు వ్యవసాయ యంత్ర పరికరాలను రాయితిపై అందించేది. ఇదారేళ్లగా ఈ పథకాలను అమలు చేయడం లేదు. ప్రస్తుత ప్రభుత్వమైనా రాయితీలు ఇస్తుందా లేదా అనేది తెలియడం లేదు ,రైతులు మాత్రం రాయితీపై విత్తనాలు ,యంత్ర పరికరాలు ఇవ్వాలని కోరుతున్నారు. రానున్న ఖరీప్ సీజన్‌లో జిల్లా రైతులు 5.97 లక్షల ఎకరాల్లో వివిధ పంటలు సాగు చేయవచ్చని వ్యవసాయశాఖ అధికారులు అంచనా వేశారు. గతేడాది 2.61లక్షల ఎకరాల్లో పత్తి పంట సాగుచేయగా ఈసారి కేంద్ర ప్రభుత్వం మద్దతు ధర పెంచడంతో 2.65లక్షల ఎకరాలు పెరగవచ్చని భావిస్తున్నారు. కంది 1.50లక్షల ఎకరాలు, వరి1.10లక్షల ఎకరాలు , మొక్కజొన్న 50.450 ఎకరాలు , పెసర 13వేల ఎకరాలు , మినుములు 5వేల ఎకరాల , జోన్నలు 20500 సాగవుతుందని అన్నారు. ముఖ్యంగా వరి ,మొక్కజొన్న , జీలుగ , జనుము , సోయబీన్ ,కంది,విత్తనాలనుఅందుబాటులో ఉండేందుకు చర్యలు చేపట్టారు. జిల్లాలో పత్తి పంటను అధిక విస్తీర్ణం లో సాగు చేసే అవకాశం ఉండటంతో అవసరం మేరకు విత్తానాలను అందుబాఉటోల ఉంచేందుకు చర్యలు చేపట్టారు. ఇందులో భాగంగా లైసెన్స్‌డ్ ఫర్టిలైజర్ సీడ్స్ దుకాణాలకు అదేశాలు జారీ చేశారు. ఎరువులు విత్తనాలు ఎంత మేర అవసరం అనే విషయాన్ని అధికారులు ఇప్పటికే ప్రభుత్వనికి నివేదికాలు ఇచ్చారు. ఖరీఫ్ సీజన్‌కు అవసరమైన విత్తనాలు ,ఎరువులు అందుబాటులో ఉంచుతాం కొరత లేకుండా చూస్తాం ,విత్తనాలు ఎరువులు కొనుగోలు చేస్తే బిల్లులు తప్పనిసరిగాతీసుకోవాలి ,బీటీ3 గైసిల్ పత్తి విత్తనాలను ప్రభుత్వం నిషేదించింది.నకిలీ విత్తనాలు అమ్మితే చర్యలు తీసుకుంటాం ,రైతులు జాగ్రత్తగా ఉండాలి జిల్లా వ్యవసాయ అధికారి రాజరత్నం తెలిపారు.

## డ్రైనేజీ సమస్యను పరిష్కరించాలని వాటర్ వర్క్స్ ఎండికి వినతి



**ప్రజాపక్షం/చర్లపల్లి:** ఉప్పల్ నియోజకవర్గంలోని ఏఎస్‌రావు నగర్,చర్లపల్లి డివిజన్ పరిధిలోని అణుపురం,చర్లపల్లిలో నెలకొన్న డ్రైనేజీ సమస్యలు పరిష్కరించాలని వాటర్ వర్క్స్ ఎండి అశోక్‌కు ఎమ్మెల్యే బండారి లక్ష్మారెడ్డి వినతి పత్రం అందజేశారు.దీనిపై స్పందించిన ఎండి సమస్యను పరిష్కరించేందకు కృషి చేస్తానని హామీ ఇచ్చారు.ప్రజలకు మౌలిక వసతులు మెరుగుపర్చడం తమ ప్రాధాన్యతని,స్థానిక సమస్యలు పరిష్కరించడంలో ఎల్లప్పుడు ముందుంటానని అన్నారు.ఈ కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ కొత్త రామారావు, మహేష్, రహీం, రామకృష్ణరావు, భగీరథ్ పాల్గొన్నారు.

## కాచిగూడ డిపో గ్యారేజీలోయూనియన్ సమావేశంపై చర్యలు తీసుకోవాలి

టిజిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్



**ప్రజాపక్షం/హైదరాబాద్:** కాచిగూడ డిపో గ్యారేజీలో టిఎంయు ఆధ్వర్యంలో యూనియన్ సమావేశం నిర్వహించడాన్ని టిజిఎస్ఆర్‌టిసి ఎంప్లాయిస్ యూనియన్ తీవ్రంగా ఖండించింది. రాణిగంజ్ డిపోకు చెందిన ఏఎంఎఫ్ గోవింద్ ఆధ్వర్యంలో గ్యారేజీలో సమావేశం నిర్వహించారని, ఈ విషయాన్ని సెక్యూరిటీ సిబ్బంది, అధికారులు పట్టించుకోలేదని యూనియన్ అధ్యక్షుడు ఎస్. బాబు, ప్రధాన కార్యదర్శి ఈదురు వెంకన్న ఆరోపించారు. బస్సుల మెయింటెనెన్స్ జరుగుతున్న సమయంలో గ్యారేజీలో సమావేశం నిర్వహించడం వల్ల పనులు గంటపాటు నిలిచిపోయి సంస్థకు నష్టం వాటిల్లిందన్నారు. డిపోలోకి ఇతర డిపో సిబ్బందిని ఎలా అనుమతించారో అధికారులు సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ఘటనపై సంబంధిత అధికారులు, గోవింద్‌తో పాటు సమావేశం నిర్వహించిన యూనియన్ నేతలపై క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరారు.

## మహిళల భద్రత, గౌరవం, సాధికారతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత

మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మహిళా కమిషన్ సభ్యురాలు చిట్యాల శ్వేత గురువారం హైదరాబాద్‌లోని మంత్రుల సముదాయంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు.ఈ సందర్భంగా మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్‌మాట్లాడుతూ తెలంగాణ సాయుధ రైతాంగ పోరాట యోధురాలు, మహిళా ధైర్యసాహసాలకు ప్రతీకగా నిలిచిన వీరవనిత చాకలి ఐలమ్మ మనుమరాలు చిట్యాల శ్వేత రాష్ట్ర మహిళా కమిషన్ సభ్యురాలిగా నియమితులవడం గర్వకారణమన్నారు. సామాజిక న్యాయం, మహిళా హక్కుల పరిరక్షణ కోసం పోరాడిన కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తూ ఆమె సమాజ సేవలో మరింత ముందుకు సాగాలని ఆకాంక్షించారు.రాష్ట్ర ప్రభుత్వం మహిళల భద్రత, గౌరవం, సాధికారతకు అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మహిళా కమిషన్ మహిళల సమస్యల పరిష్కారం, హక్కుల పరిరక్షణ, చట్టపరమైన సహాయం అందించడంలో కీలక భూమిక పోషిస్తుందని పేర్కొన్నారు.

## కేసు నమోదై వారం గడుస్తున్నా భగీరథను అరెస్టు చేయరా:ఎఐవైఎఫ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్‌పై పోక్సో కేసు నమోదై వారం రోజులు గడుస్తున్నా అరెస్టు చేయకపోవడం పట్ల ఎఐవైఎఫ్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. బండి సాయి భగీరథను తక్షణమే అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం హిమయత్‌నగర్ చౌరస్తా వద్ద ఎఐవైఎఫ్ ఆధ్వర్యంలో కళ్లకు గంతలు కట్టుకుని నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఎఐవైఎఫ్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె.ధర్మేంద్ర మాట్లాడుతూ ఒక మైనర్ బాలికకు సంబంధించిన అత్యంత సున్నితమైన కేసులో ఎఫ్ఐఆర్ నమోదై వారం రోజులు గడుస్తున్నా అరెస్టు చేయకపోవడంతో ప్రభుత్వం వ్యవహరిస్తున్న తీరు అనేక అనుమానాలకు తావిస్తోంద న్నారు. ఎఐవైఎఫ్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు నేర్లకంటి శ్రీకాంత్ మాట్లాడుతూ బండి భగీరథ్ కేసు సంబంధించి విచారణకు ఏర్పాటు చేసిన ప్రత్యేక దర్యాప్తు బృందం నిజమైన నిష్పాక్షిక దర్యాప్తు చేయాలని కరోరారు. లేకపోతే చట్టం సామాన్యులకోసం ఒకలా, అధికార పార్టీల నేతలకోసం మరోలా పనిచేస్తుందని భావించాల్సి వస్తుందన్నారు. కార్యక్రమంలో ఎఐవైఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఎం.శ్రీమాన్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు సల్మాన్ బేగ్, షేక్ మహమూద్, అవినాష్, భరత్, చెట్టుకింది శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## నీట్ ప్రశ్నా పత్రం లీకేజీ బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలి

ఎఐడిఎస్ఓ డిమాండ్

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** నీట్ ప్రశ్నాపత్రాల లీకేజీలకు బాధ్యులైన వారందరిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆల్ ఇండియా డెమొక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఎఐడిఎస్ఓ) హైదరాబాద్ జిల్లా కమిటీ డిమాండ్ చేసింది. జాతీయ స్థాయి పరీక్షల్లో, నీట్‌యుజి పరీక్షలో వరుసగా జరుగుతున్న అక్రమాలు, ప్రశ్నాపత్రాల లీకేజీలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ సందర్భంగా డాక్టర్ ఆర్.గంగాధర్ మాట్లాడుతూ జాతీయ స్థాయి పరీక్షల్లో పారదర్శకత, భద్రతను కాపాడడంలో జరుగుతున్న వరుస వైఫల్యాలపై తీవ్ర ఆందోళన వ్యక్తం చేశారు, విద్యార్థుల ప్రయోజనాలను రక్షించేందుకు, పరీక్షా వ్యవస్థపై ప్రజల విశ్వాసాన్ని పునరుద్ధరించేందుకు తక్షణ చర్యలు అవసరమని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సిహెచ్. శశాంక్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షులు నితీష్, కార్యదర్శి నాగరాజు సభ్యులు సిద్ధూ, విశాలి, నిహిత, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

# సంఘర్షణల పరిష్కారానికి...
# ‘సంభాషణ–దౌత్యమే’ సుస్థిర మార్గం

విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్

పశ్చిమాసియా సంక్షోభం, ఇంధన సరఫరా, సముద్ర స్థిరత్వంపై ఆందోళన వ్యక్తం



**న్యూఢిల్లీ :** పశ్చిమాసియా సంక్షోభం, ఇంధన సరఫరాలపై దాని ప్రభావం, హోర్ముజ్ జలసంధిలో సముద్ర స్థిరత్వంపై భారతదేశం గురువారం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. అలాగే భౌగోళిక, రాజకీయ అస్థిరతలు ఏకపక్ష నిర్బంధ ఆంక్షలను ఎదుర్కొనేందుకు ఆచరణాత్మక మార్గాలను అభివృద్ధి చేయాలని బ్రిక్స్ దేశాలను కోరింది. ఇక్కడ జరుగుతున్న రెండు రోజుల బ్రిక్స్ సదస్సు ప్రారంభ రోజున విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ ప్రసంగించారు. ఏ నిర్దిష్ట దేశాల పేర్లను ఆయన ప్రస్తావించకుండా సార్వభౌమత్వం, ప్రాదేశిక సమగ్రత పట్ల గౌరవం, అంతర్జాతీయ సంబంధాలకు మూల స్థంభంగా ఉండాలని నొక్కిచెప్పారు. సంఘర్షణల పరిష్కారానికి ‘సంభాషణ’, ‘దౌత్యం’ మాత్రమే సుస్థిరమైన మార్గమని మంత్రి పేర్కొన్నారు. ఉద్రిక్తతలను తగ్గించే ప్రయత్నాలకు నిర్మాణాత్మకంగా సహకరించడానికి, స్థిరత్వాన్ని పునరుద్ధరించే లక్ష్యంతో చేపట్టిన కార్యక్రమాలకు మద్దతు ఇవ్వడానికి భారతదేశం సిద్ధంగా ఉందని అన్నారు. ‘శాంతి ముక్కలుగా కాకూడదు’ అని మంత్రి జైశంకర్ స్పష్టంచేశారు. అంతర్జాతీయ చట్టాన్ని గౌరవించడం, పౌరులను రక్షించడం, ప్రజా మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకోకుండా ఉండటం అత్యవసరమని ఆయన అన్నారు. హోర్ముజ్ జలసంధి, ఎర్ర సముద్రం గుండా సురక్షితమైన, నిరాటంకమైన సముద్ర ప్రవాహాలను నిర్ధారించాలని గట్టిగా నొక్కిచెప్పడంతోపాటు , గాజాలోని సంఘర్షణ వల్ల కలిగే తీవ్రమైన మానవతా పరిణామాలపై విదేశాంగ మంత్రి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ సమావేశానికి హాజరవుతున్న సీనియర్ నాయకులలో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి, రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, బ్రెజిల్ విదేశాంగ మంత్రి మావురో వీయిరా, ఇండోనేషియా విదేశాంగ మంత్రి సుగియోనో , సౌత్ ఆఫ్రికా అంతర్జాతీయ సంబంధాల మంత్రి రోనాల్డ్ లామోలా తదితరులు ఉన్నారు. ‘పాలస్తీనా సమస్యకు సంబంధించి ద్విరాజ్య పరిష్కారానికి మద్దతు ఇస్తూ, సుస్థిరమైన కాల్పుల విరమణ, మానవతా సహాయానికి ప్రాప్యత, శాశ్వతమైన, శాంతియుత పరిష్కారం వైపు స్పష్టమైన మార్గం అత్యవసరం’ అని జైశంకర్ అన్నారు. సిరియా ఎదుర్కొంటున్న సవాళ్లతో పాటు సూడాన్, యెమెన్, లిబరల్ అరబ్ దేశాలలో నెలకొన్న పరిస్థితులను ప్రస్తావిస్తూ, వాటిని పరిష్కరించడానికి నిరంతర అంతర్జాతీయ భాగస్వామ్యం, సమన్వయ ప్రయత్నాలు అవసరమని ఆయన పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆయన ఉగ్రవాదాన్ని ‘కొనసాగుతున్న ముప్పు’గాఅభివర్ణించారు. ఉగ్రవాద చర్యలకు ఎటువంటి సమర్థన ఉండదని స్పష్టంచేశారు. బ్రిక్స్ కూటమికి అధ్యక్షత వహిస్తున్న భారతదేశం సెప్టెంబరులో జరగనున్న ఈ కూటమి వార్షిక శిఖరాగ్ర సమావేశానికి ముందుగా విదేశాంగ మంత్రుల సదస్సుకు ఆతిథ్యం ఇస్తోంది. ప్రారంభంలో బ్రెజిల్, రష్యా, ఇండియా, చైనా, సౌత్ ఆఫ్రికాలతో కూడిన బ్రిక్స్ కూటమి, 2024లో ఈజిప్ట్, ఇథియోపియా, ఇరాన్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌లను చేర్చుకోవడంతో విస్తరించింది. 2025లో ఇండోనేషియా కూడా ఇందులో చేరిపోయింది. బ్రిక్స్ సమావేశానికి భారత విదేశాంగ మంత్రి ఎస్.జైశంకర్ అధ్యక్షత వహించనున్నారు.

### బ్రిక్స్ విదేశాంగమంత్రులతో ప్రధాని మోదీ భేటీ

అత్యంత ప్రభావవంతమైన బ్రిక్స్ కూటమి విదేశాంగ మంత్రుల ప్రతిష్ఠాత్మక సదస్సును ప్రారంభించిన సందర్భంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ గురువారం బ్రిక్స్ దేశాల అగ్రశ్రేణి దౌత్యవేత్తలకు ఆతిథ్యం ఇచ్చారు. ప్రధానమంత్రిని సంయుక్తంగా కలిసిన ప్రముఖులలో రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్రోవ్, ఇరాన్‌కు చెందిన అబ్బాస్ అరాఘ్చి బ్రెజిల్ కు చెందిన మావురో వీయిరా, ఇండోనేషియాకు చెందిన సుగియోనో, సౌత్ ఆఫ్రికాకు చెందిన రోనాల్డ్ లామోలా ఉన్నారు. పశ్చిమాసియా సంక్షోభానికి దారితీసిన ఆర్థిక పరిణామాలతో, ముఖ్యంగా తీవ్రతరమైన ఇంధన సరఫరాలతో, వాణిజ్యం, సుంకాలపై వాషింగ్టన్ విధానంతో ఈ ప్రభావవంతమైన కూటమి సతమతమవుతున్న తరుణంలో భారతదేశం ఆతిథ్యం ఇచ్చిన ఈ సమావేశం మరింత ప్రాముఖ్యతను సంతరించుకుంది. బ్రిక్స్ కూటమికి అధ్యక్షత వహిస్తున్న భారతదేశం సెప్టెంబరులో జరగనున్న ఈ కూటమి వార్షిక శిఖరాగ్ర సమావేశానికి ముందుగా గురువారం నుంచి రెండు రోజులపాటు జరిగే ఈ సదస్సుకు ఆతిథ్యం ఇస్తోంది.

## రిటైర్డ్ డిజిపి భార్య హత్య కేసులో కీలక పురోగతి

నిందితులు దేశం దాటలేదని నిర్ధారించిన పోలీసులు



**ప్రజాపక్షం/హైదరాబాద్:** హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన రిటైర్డ్ డిజిపి వినయ్ రంజన్ రాయ్ భార్య హత్య, దోపిడీ కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ప్రధాన నిందితురాలిగా భావిస్తున్న నేపాల్‌కు చెందిన పనిమనిషి కల్పన, ఆమె ముఠా సభ్యులు దేశం విడిచి పారిపోలేదని, దేశ సరిహద్దుల్లోనే ఎక్కడో తలదాచుకున్నారని పోలీసులు దాదాపుగా నిర్ధారణకు వచ్చారు. నిందితులను పట్టుకునేందుకు ఏర్పాటు చేసిన 10 ప్రత్యేక పోలీస్ బృందాలు దేశవ్యాప్తంగా గాలింపు చర్యలను ముమ్మరం చేశాయి. ఈ హత్య, దోపిడీ పక్కా ప్రణాళికతోనే జరిగిందని దర్యాప్తులో తేలింది. నిందితురాలు కల్పన ఫోన్ కాల్ డేటాను విశ్లేషించిన పోలీసులు, ఆమె ముఠా సభ్యులు నేపాల్‌కు వెళ్లలేదని స్పష్టం చేసుకున్నారు. దీంతో పూణె, ముంబై, ఢిల్లీ, ఉత్తరప్రదేశ్, బీహార్, మధ్యప్రదేశ్‌తో పాటు ఇండోనేపాల్ సరిహద్దుల్లోనూ నిందితుల కోసం ముమ్మరంగా గాలిస్తున్నారు. ఈ కేసులో కల్పనతో పాటు మరో ఇద్దరు ఉన్నట్లు పోలీసులు అనుమానిస్తున్నారు. ఇప్పటికే కల్పనకు సంబంధించిన కొందరిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నట్లు, వారి ద్వారా కీలక సమాచారం రాబట్టినట్లు తెలుస్తోంది. నిందితులకు ఎవరు ఆశ్రయం కల్పించారనే కోణంలోనూ దర్యాప్తు చేస్తున్నారు. ఈ కేసు త్వరలోనే ఓ కొలిక్కి రానుందని పోలీసు వర్గాలు భావిస్తున్నాయి. ఇదిలా ఉండగా, జవహర్‌నగర్ పోలీస్ స్టేషన్ పరిధిలో మరో నేపాలీ ముఠా చేసిన భారీ దోపిడీ కేసులోనూ దర్యాప్తు వేగంగా సాగుతోంది. ఈ కేసులో ఏడుగురు నేపాలీలు ఉన్నట్లు గుర్తించిన మల్కాజ్‌గిరి పోలీసులు, హైదరాబాద్ సిటీ పోలీసుల తో కలిసి ఢిల్లీ సరిహద్దుల్లో గాలిస్తున్నారు. ఈ ముఠా సభ్యులు సరిహద్దు దాటి నేపాల్‌కు చేరుకున్నారా లేక దేశంలోని ఇతర నగరాల్లో తలదాచుకున్నారా అనే దిశగా విచారణ జరుపుతున్నారు.

## ఇంటర్ ఫస్ట్ ఇయర్‌లోనూ ప్రాక్టికల్స్



**హైదరాబాద్ :** ఇంటర్మీడియట్ విద్యలో సమూల మార్పులకు ఇంటర్‌బోర్డు శ్రీకారం చుట్టింది. ఇకపై ఇంటర్ ప్రథమ సంవత్సరంలోనూ ప్రయోగ పరీక్షలు ఉండనున్నాయి. ఫిజిక్స్, కెమిస్ట్రీ, బోటనీ, జువాలజీ సబ్జెక్టుల్లో ప్రయోగ పరీక్షలు నిర్వహించనున్నారు. ఫస్ట్ ఇయర్‌లో 15 మార్కులు, సెకండ ఇయర్‌లో 15 మార్కులకు ఈ ప్రాక్టికల్స్ నిర్వహిస్తారు. ఇంటర్ విద్యలో యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌ను ప్రవేశపెట్టింది. గణితంలో 75 మార్కులకు బదులు 60 మార్కులకు ఫైనల్ పరీక్షలు నిర్వహిస్తారు. ఇంటర్నల్ అసెస్‌మెంట్‌కు ఒక్కో ఏడాదికి 15 మార్కులు కేటాయించారు. హ్యుమానిటీస్‌లో యాక్టివిటీ బేస్డ్ లెర్నింగ్‌కు సంబంధించి 20 మార్కులు కేటాయిస్తారు. ఫైనల్ పరీక్షలు 100 మార్కులకు బదులు 80 మార్కులకే ఉండనున్నాయి. భాషా విభాగాల్లోనూ 100 మార్కులకు బదులుగా 800 మార్కులకు పబ్లిక్ పరీక్షలు ఉంటాయి. లాంగ్వేజ్ సబ్జెక్టుల్లో 20 మార్కులకు ఇంటర్నల్ అసెస్‌మెంట్ ఉంటుంది. ఇదిలా ఉండగా, తెలంగాణ రాష్ట్రంలో ఈ ఏడాది ఇంటర్మీడియట్ అడ్మీషన్లను యథావిధిగా కొనసాగించనున్నట్లు ప్రభుత్వం కొద్దిరోజుల క్రితమే ప్రకటించింది. పాఠశాల విద్యలో ఇంటర్మీడియట్‌ను విలీనం చేసే అంశంపై అధికారులతో సమీక్షనిర్వహించిన సీఎం రేవంత్ ఈ ఏడాది ఇంటర్ అడ్మిషన్లు చేపట్టాలని అధికారులను ఇటీవల ఆదేశించారు. ప్రవేశాలకు సమయం తక్కువగా ఉండడం, ఇంటర్మీడియట్‌ను పాఠశాల విద్యలో విలీనం చేసే ప్రక్రియకు పలు సాంకేతిక సమస్యలు కారణంగా విద్యార్థుల ప్రయోజనాలకు భంగం వాటిల్లకుండా వెంటనే ప్రవేశాల ప్రక్రియను చేపట్టాలని రేవంత్ రెడ్డి సూచించారు. ఇంటర్ రద్దు చేసి సీబీఎస్ఈలో మాదిరే 11, 12 తరగతులు నిర్వహించాలని ఫలితంగా డ్రాపౌవుట్స్ సంఖ్య గణనీయంగా తగ్గుతుందని తెలంగాణ ఎడ్యుకేషన్ కమిషన్ తెలంగాణ ప్రభుత్వానికి సూచించింది.

## దోపిడీ ఉన్నంతకాలం ఎర్రజెండా ఉంటుంది : తమ్మినేని



**ప్రజాపక్షం/హైదరాబాద్ :** మార్క్సిజం అజేయమని, దోపిడీ ఉన్నంత కాలం ఎర్రజెండా ఉంటుందని, కింద పడ్డ ప్రతిసారి రెట్టింపు ఉత్సాహంతో పైకి లేస్తుందని . సిపిఐ (ఎం ) కేంద్ర కమిటీ సభ్యులు తమ్మినేని వీరభద్రం తెలిపారు. సిపిఐ (ఎం ) రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో హైదరాబాద్‌లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో మూడురోజులపాటు నిర్వహించే రాజకీయ శిక్షణ తరగతులు గురువారం ప్రారంభమైయ్యాయి. ఈ సందర్భంగా ముందు పార్టీ సీనియర్ నాయకులు సారంపెల్లి మల్లారెడ్డి జెండాను ఆవిష్కరించారు. సిపిఐ( ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు బండారు రవికుమార్ అధ్యక్షతన జరిగిన ప్రారంభ సభను ఉద్దేశించి తమ్మినేని వీరభద్రం మాట్లాడుతూ పెట్టుబడిదారీ సమాజంలో ఉత్పత్తి పెరుగుదలకు ఉత్పత్తి సాధనాలపై ప్రైవేట్ వ్యక్తుల యాజమాన్యం ఆటంకమైనపుడు సామాజిక విప్లవం ద్వారా సోషలిస్టు వ్యవస్థకు పరిణామం చెందటం అనివార్యమని మార్క్స్ నిరూపించాడని చెప్పారు.ఈ శాస్త్రీయ ప్రతిపాదనలన్నీ మార్క్స్ ఊహించి చేసినవేమీ కావాని భూమి పుట్టుక నుండి ప్రకృతి, అందులో భాగమైన మానవ సమాజమూ నిరంతరాయంగా మారుతూ వస్తోందన్నారు.అమెరికా, ఇజ్రాయిల్ దేశాలు ఇరాన్‌పై సాగిస్తున్న యుద్ధం కేవలం ఆ మూడుదేశాలకేగాక మొత్తం ప్రపంచంపైన ప్రభావం చూపుతోందని, ఆర్థిక, రాజకీయ సంక్షోభాలు ఏర్పడుతాయని తెలిపారు. ఇప్పటికే అమెరికా ఆర్థిక, మిలటరీ శక్తులు ఇప్పటికే బాగా బలహీనపడ్డాయని, దీంతో అమెరికా తిరుగులేని ప్రపంచాధిపత్యం బద్దలౌతుందని చెప్పారు. చైనా అధ్వర్యంలో అనేక సామ్రాజ్యవాద వ్యతిరేక దక్షిణాది దేశాలు ఈ సమస్యపై ఇప్పటికే కార్యాచరణ ప్రారంభించాయని ఈ క్రమం ఇంకా వేగవంతమై అమెరికా పెత్తనం నశించి బహుళధృవ ప్రపంచం ఏర్పడే సూచనలు గోచరిస్తున్నాయని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిపిఐ(ఎం) రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు జూలకంటి రంగారెడ్డి, ఎండి అబ్బాస్, జి నాగయ్య తదితరులు పాల్గొన్నారు.

## రాజ్యాంగ అధికారాలు వినియోగించుకోలేకపోవడమే...

మణిపూర్‌లో హింసాకాండను పరిష్కరించడంలో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విఫలం : ఓ. ఇబోబి సింగ్

**ఇంఫాల్ :** మణిపూర్‌లో తరచుగా జరుగుతున్న హింసాకాండకు, క్లిష్ట సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు తమ రాజ్యాంగ అధికారాలను సక్రమంగా వినియోగించుకోలేకపోవడమే కారణమని మణిపూర్ కాంగ్రెస్ విభాగం గురువారం ఆరోపించింది. కాంగ్‌పోక్పిలో ముగ్గురు అనుమానిత మిలిటెంట్లు ముగ్గురు చర్చి నాయకులను కాల్చి చంపిన తర్వాత, అలాగే నోనీ జిల్లాలో ఒక వ్యక్తి హత్యకు గురికావడంతో కాంగ్రెస్ ఈ వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర కాంగ్రెస్ అధ్యక్షుడు ఓ. ఇబోబి సింగ్ విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ‘ఈ హత్యలను తీవ్రంగా ఖండిస్తున్నాము. బుధవారం ఉదయం ఒక వర్గానికి చెందిన ముగ్గురు వ్యక్తులు హత్యకు గురయ్యారు, అదే రోజు సాయంత్రం మరొక వర్గానికి చెందిన ఒక పౌరుడు హత్యకు గురయ్యాడు; ఇది ప్రతీకార చర్యగా కనిపిస్తోంది. రాష్ట్రంలో జరుగుతున్న వరుస హత్యలను కేంద్ర ప్రభుత్వం ఇంకెంత కాలం మూగ ప్రేక్షకపాత్ర వహిస్తూ చూస్తూ ఉంటుంది? రాష్ట్రం పూర్తిగా తనకుతానే వదిలేసినట్లుగా, వివిధ వర్గాల ప్రజలు ఒకరినొకరు చంపుకునేందుకు అనుమతిస్తున్నట్లుగా కనిపిస్తోంది‘ అని మూడుసార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన ఈ మాజీ ముఖ్యమంత్రి వ్యాఖ్యానించారు. 2023లో జరిగిన జాతి హింసాకాండను ప్రస్తావిస్తూ, రాష్ట్రంలో శాంతిభద్రతలు పూర్తిగా కుప్పకూలాయని స్వయంగా సుప్రీం కోర్టే గతంలో వ్యాఖ్యానించిందన్నారు. వర్గాల మధ్య జరిగే హత్యలు ఎప్పటికీ ఏ సమస్యకూ పరిష్కారం చూపలేవని, ప్రతీకార ధోరణిని విడనాడాల్సిన సమయం ఆసన్నమైందని ఆయన పేర్కొన్నారు. శాంతిభద్రతల పరిరక్షణ రాష్ట్ర ప్రభుత్వ బాధ్యత అని పునరుద్ఘాటించారు. ప్రభుత్వానికి సంక్రమించిన రాజ్యాంగ అధికారాలను రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు రెండూ సక్రమంగా వినియోగించుకోవడం లేదని, ఈ అశాంతికి ఇదే ప్రధాన కారణమని భావిస్తున్నానన్నారు. మే 2023 నుండి మైతేయ్, కుకీ వర్గాల మధ్య జరిగిన హింసాకాండలో మణిపూర్‌లో కనీసం 260 మంది ప్రాణాలు కోల్పోగా, వేలాది మంది నిరాశ్రయులయ్యారు.

## బిజెపి అంటే ‘బిసిల జూట పార్టీ’

బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్




**ప్రజాపక్షం/హైదరాబాద్:** బిజెపి అంటే ‘బిసిల జూట పార్టీ’ అని బిసి సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షుడు జాజుల శ్రీనివాస్ గౌడ్ అన్నారు. డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ రాష్ట్ర సచివాలయం మీడియా పాయింట్ వద్ద గురువారం ఆయన మాట్లాడుతూ హైదరాబాద్‌లో ఇటీవల జరిగిన ప్రధాని సభలో బిసి కులగణన అంశాన్ని ప్రస్తావించకపోవడం ద్వారా బిజెపి మరోసారి బిసి వ్యతిరేక పార్టీ అని నిరూపించుకుందని విమర్శించారు. తెలంగాణలో బిసి కులగణన చేపట్టకుండా బిజెపి మరో 100 సంవత్సరాలైనా అధికారంలోకి రాదని ఆయన హెచ్చరించారు. బిజెపి సభ జరిగిన పెరేడ్ గ్రౌండ్‌లోనే త్వరలో బిసి మహా గర్జన నిర్వహించి బిసిల సత్తాను కేంద్ర ప్రభుత్వానికి చూపిస్తామని తెలిపారు. 11 ఏళ్ల బిజెపి పాలనలో బిసిలకు ఎలాంటి ప్రయోజనం చేకూరలేదని విమర్శించారు. మహిళా రిజర్వేషన్ బిల్లులో ఓబిసి మహిళలకు సబ్ కోటా కల్పించకుండా అన్యాయం చేశారని, అలాగే కేంద్రంలో ప్రత్యేక ఓబిసి మంత్రిత్వ శాఖ ఏర్పాటు చేయకుండా దేశంలోని 80 కోట్ల మంది బిసిల అభివృద్ధిని విస్మరించారని ఆరోపించారు. ఈ సమావేశంలో బిసి కుల సంఘాల జెఎసి చైర్మన్ కుందారం గణేష్ చారి, బిసి నేతలు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, తాటికొండ విక్రమ్ గౌడ్, ప్రొఫెసర్ బాగయ్య, కాటేపల్లి వీరస్వామి, జల్లెల నరసింహ తదితరులు పాల్గొన్నారు.

## అన్నదాత ఆశలను వమ్ముచేసిన కేంద్రం

తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి

**ప్రజాపక్షం/హైదరాబాద్ :** అన్నదాత ఆశలను కేంద్ర ప్రభుత్వం వమ్ము చేసిందని తెలంగాణ సీడ్స్ కార్పొరేషన్ చైర్మన్ అన్వేష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. పెరుగుతున్న సాగు ఖర్చులు, ఎరువులు, విత్తనాలు, కూలీల వ్యయం, డీజిల్ ధరలు, ప్రకృతి విపత్తులతో రైతులు ఇప్పటికే ఆర్థికంగా కుదేలై ఉన్న సమయంలో కేంద్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధరలు దేశ రైతాంగాన్ని తీవ్ర నిరాశకు గురి చేశాయని పేర్కొన్నారు. రైతులు ఈసారి కనీస మద్దతు ధరల్లో గణనీయమైన పెంపు ఉంటుందని ,పెంచిన కనీస మద్దతు ధర రైతు దక్కేలా చట్టం తెస్తారని ఆశగా ఎదురుచూశారని, కానీ కేంద్రం మాత్రం దగా చేసిందన్నారు. ముఖ్యంగా మొక్కజొన్న పంటకు నామమాత్రంగా మాత్రమే ధర పెంచడం వెనుక అమెరికా ఒత్తిడి స్పష్టంగా కనిపిస్తోందని అన్వేష్ రెడ్డి విమర్శించారు. దేశ రైతు ప్రయోజనాల కంటే విదేశీ ఒత్తిళ్లకే కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని ఆరోపించారు. కేంద్ర ప్రభుత్వ తీరు మొక్కజొన్న రైతు గోచిని లాగేసే విధంగా ఉందని ఆరోపించారు. ఒకవైపు పంటల వైవిధ్యీకరణ పేరుతో మొక్కజొన్న, నూనెగింజలు, అయిల్ సీడ్స్ ఇతర ప్రత్యామ్నాయ పంటలు సాగు చేయాలని కేంద్రం రైతులకు ఉచిత సలహాలిస్తూ మరోవైపు ఆ పంటలను కొనుగోలు చేయడంలో మాత్రం పూర్తిగా విఫలమవుతోందని అన్నారు. కేంద్రంలో అధికారంలో ఉండి చేయాల్సిన పని చేయకుండా బిజెపి నేతలు ఇష్టానుసారంగా రాష్ట్ర ప్రభుత్వాన్ని నిందిస్తున్నారన్నారు.బిజెపి నాయకులకు రైతుల పై ప్రేమ ఉంటే కనీస మద్దతు ధరకు చట్టబద్ధత కల్పించడంతో పాటు రాష్ట్రం లో పండిన పంటలను ఎలాంటి అంక్షలు లేకుండా కొనుగోలు చేయాలనీ అన్వేష్ రెడ్డి డిమాండ్ చేశారు.

# 42 నెలల గరిష్ఠస్థాయికి టోకు ధరల ద్రవ్యోల్బణం



**న్యూఢిల్లీ:** దేశంలో టోకు ధరల సూచీ (డబ్ల్యుపిఐ) ద్రవ్యోల్బణం గడచిన 42 నెలల్లో ఎన్నడూలేనివిధంగా గరిష్ఠస్థాయిలో 8.3 శాతానికి పెరిగింది. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల కారణంగా ఇంధన ధరలు ఊహించనివిధంగా పెరిగిపోవడంతో టోకు ధరల ద్రవ్యోల్బణం అసాధారణస్థాయికి చేరింది. మార్చినెలలో టోకు ధరల ద్రవ్యోల్బణం 3.88 శాతంగా నమోదైంది. గత ఏడాది ఏప్రిల్ నెలలో మాత్రం ఇదే ద్రవ్యోల్బణం 0.85 శాతంగా ఉండేది. గ్లోబల్ బ్రోకరేజ్ బార్క్‌లేస్ చెప్పిన సమాచారం ప్రకారం, టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణంలో క్రమానుగత పెరుగుదల ఈ సారి రికార్డుస్థాయికి చేరుకుంది. ప్రపంచ చమురు ధరల పెరుగుదల కారణంగా వస్తుసేవలతో సహా యావత్ ఆర్థిక వ్యవస్థకు సంబంధించిన ద్రవ్యోల్బణం గణనీయంగా పెరిగిపోవడానికి దారితీసింది. దీంతో కీలకమైన టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం గత ఏడాదితో పోల్చిచూస్తే ఐదుశాతం మేరకు పెరిగింది. లోహాల తయారీ ధరలు బాగా పెరిగిపోవడం, రసాయనాలు,వస్త్రాలు ధరలు ఈ పెరుగుదలకు ప్రధాన కారణాలుగా మారాయి. ఇక ఇంధనం,విద్యుత్‌కు సంబంధించిన టోకు ధరల సూచీ ద్రవ్యోల్బణం ఏప్రిల్ నెలలో 24.17 శాతానికి పెరిగిపోయింది. గడచిన 42 నెలల్లో ఇలాంటి పరిస్థితి సంభవించలేదు. అంతకు ముందు మార్చినెలలో ఇంధనం,విద్యుత్ టోకు ధరల ద్రవ్యోల్బణం 1.05 శాతంగా మాత్రమే ఉండేది. ముడి పెట్రోలియం ద్రవ్యోల్బణం ఏప్రిల్ నెలలో 88.06 శా తంగా నమోదైంది 2021 అక్టోబరు తర్వాత నుండి ఈనాటి వరకూ ఇంత భారీస్థాయిలో ముడి పెట్రోలియం ద్రవ్యోల్బణం పెరగడం ఇదే మొదటిసారి. పశ్చిమాసియాలో హోర్ముజ్ జలసంధిని మూసివేయడం, ఇరాన్ ఓడరేవులపై దిగ్బంధనం వంటి చర్యల కారణం గా మనదేశానికి పెట్రోలియం దిగుమతులు స్తంభించిపోయాయి. ఈ సరఫరా వ్యవస్థ విచ్ఛిన్నమైంది. అదేవిధంగా ముడి చమురు ధరలు కూడా ప్రపంచవ్యాప్తంగా భారీస్థాయిలో పెరిగాయి. ‘‘ప్రధానంగా మినరల్ ఆయిల్స్ (శుద్ధిచేసిన ముడిచమురు నుండి వచ్చిన తేలికపాటి ద్రవాలు),ముడి పెట్రోలియం,సహజవాయువు,కాపర్, జింక్, అల్యూమినియం వంటి భారీ ఖరీదులేని మౌలిక లోహాలు, ఇతర తయారీ వస్తువులు,ఆహారేతర వస్తువుల కారణంగా ఈ ఏడాది ఏప్రిల్‌నెలలో సానుకూల ద్రవ్యోల్బణం పెరిగింది’’ అని కేంద్ర మంత్రిత్వశాఖ ప్రకటించింది. తయారీ ఉత్పత్తులు,ద్రవ్యోల్బణం ఏప్రిల్ నెలలో 4.62 శాతం ఉండగా, అంతకుముందు మార్చినెలలో 3.39 శాతంగానే ఉండేది. ఇంధనం,విద్యుత్‌కు సంబంధించి ఎల్‌పిజిలో ద్రవ్యోల్బణం 10.92 శాతంగా ఏప్రిల్ నెలలో నమోదుకాగా, మార్చినెలలో మైనస్ 1.54 శాతంగా నమోదైంది. పెట్రోలులో 32.40 శాతంగా ఏప్రిల్‌నెలలో నమోదుకాగా, మార్చిలో 2.50 శాతంగా నమోదైంది. హైస్పీడ్ డీజిలు ద్రవ్యోల్బణం ఏప్రిల్‌నెలలో 25.19 శాతంగా, మార్చినెలలో 3.26 శాతంగా నమోదయ్యాయి. ప్రపంచస్థాయిలో ముడిచమురు ధరలు 50 శాతం మేరకు పెరిగినప్పటికీ ప్రభుత్వం ఇప్పటివకూ బంకుల్లో వాహనాల ఆయిల్ ధరలను, వంటగ్యాస్ ధరలను పెరగకుండా స్థిరంగా ఉంచిందని మంత్రిత్వశాఖ పేర్కొంది. వాణిజ్యానికి సంబంధించిన ఎల్‌పిజి మాత్రం ధర పెరిగింది.

